**విలేకరులు కావలెను**

**తొలివెలుగు** జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

**సంప్రదించాల్సిన చిరునామా..**

**సెల్ : 9491134365**



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం — జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక. 78 | బుధవారం | 14-అక్టోబర్-2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వేల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue. 78 | Wednesday | 14.10.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |


## లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే

### చైనా అభ్యంతరాలపై భారత్ స్పష్టీకరణ

2

- లద్దాఖ్‌లో 28 కీలక ప్రాంతాలకు అధికారిక పేర్ల ఖరారు
- విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్
- భారత నిర్ణయం చట్టవిరుద్ధమంటూ చైనా వ్యాఖ్యలు






# ఉగ్రవాదంపై భారత్ వెనక్కి తగ్గదు

2

### వారికి ఆశ్రయం లేకుండా చూడాలి

- నిధుల సరఫరాను అడ్డుకోవాలి
- బీఐఎంఎస్‌టీఈసీ దేశాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపు

"ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు.



# 2029లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు



- ఎస్ఐఆర్ పేరుతో అబద్ధపు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు
- చొరబాటుదారులకు రక్షణ కల్పించే వ్యూహాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు
- రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలపై అమిత్ షా ఫైర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్షాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీకి లభిస్తున్న ప్రజాదరణను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) పేరుతో అబద్ధపు ప్రచారానికి దిగుతున్నాయని ఆరోపించారు. ఈ విధానం ముసుగులో చొరబాటుదారులకు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలన్న కాంగ్రెస్ వ్యూహాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.
బీజేపీ, మోదీ విజయాలను ఎన్నికల ప్రక్రియకు ఆపాదించి కొట్టిపారేయడం మానుకుని, కాంగ్రెస్ తన వైఫల్యాలపై తరువాయి 2లో

# మాతోనే దేశ ప్రజలు

### ప్రజాస్వామ్య పరిరక్షణకు విపక్షాల ఐక్యపోరాటం

- ఓటు చోరీకి బాధ్యులైన వారిని కోర్టు ముందు నిలబెట్టడమే లక్ష్యం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు
- విపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులతో రాహుల్ భేటీ

"మేమంతా ఇక్కడ ఏకతాటిపై, ఒక్కటిగా నిలబడి ఉన్నాం. నేను సోమవారం చెప్పినట్లు సమాంతరంగా నిరసనలు ఏమీ లేవు. అది ఒకే ఒక్క నిరసన. ఆ నిరసన లక్ష్యం కూడా ఒకటే. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థలు నాశమయ్యాయి. నిజమైన ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు మేమంతా కలిసి పోరాటం చేస్తున్నాం.

–లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు ప్రతిపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాలు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేస్తున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. తన నివాసంలో ఇండియా కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులకు ఆయన తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఓటు చోరీకి బాధ్యులని తాము ఆరోపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌లను కోర్టు ముందు నిలబెట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.
దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థలు దెబ్బతిన్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించేందుకు విపక్షాలన్నీ కలిసికట్టుగా పోరాడుతున్నాయని చెప్పారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తిపై తమకు పూర్తి గౌరవం ఉందని, న్యాయవ్యవస్థ తన బాధ్యతను నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు.
ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతించే ప్రదేశాన్ని డీనోటిఫై చేయడాన్ని రాహుల్ గాంధీ ఖండించారు. నిరసన తెలిపే హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాడుతున్నామని, సోమవారం ఢిల్లీ వీధుల్లో నిర్వహించిన నిరసనల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. ఆందోళనలకు మద్దతు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఓటు చోరీకి ఎవరు బాధ్యులైనా శిక్ష అనుభవించాల్సిందేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు రాజకీయ, ప్రజా నిరసనలు కొనసాగిస్తామని ప్రకటించారు. తమది వేర్వేరు ఆందోళనల సమాహారం కాదని, ప్రజాస్వామ్య పునరుద్ధరణే లక్ష్యంగా సాగుతున్న ఒకే ఉద్యమమని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, శశిథరూర్, పవన్ ఖేరాతోపాటు ఆర్జేడీ నేతలు తేజస్వీ యాదవ్, మనోజ్ ఝా, టీఎంసీ నేత మహువా మొయిత్రా, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులు కూడా హాజరై తమ సంఘీభావం తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు.



## విదేశీ శక్తులతో కమ్యూనిస్టుల కుట్ర



- దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్లాన్
- నిరసనలతో ఢిల్లీ వ్యాపారాలకు నష్టం
- రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదు
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

2



ప్రభుత్వ పాఠశాలల సరఫరా

## టెండర్లు రద్దు చేయాలి

2

- పాత విధానంలోనే స్థానిక వ్యాపారులకు అవకాశం కల్పించాలి
- పీఎంయూ టెండర్లపై హరీశ్‌రావు అభ్యంతరం
- స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన

# రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

### పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై నిర్లక్ష్యం వద్దు

- ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- కరవు, విద్యుత్ కొరతపైనా నేతలతో సమీక్ష



న్యూఢిల్లీ: తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ నేతలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి దశపైనా ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో అందుబాటులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. గంటకు పైగా సాగిన ఈ భేటీలో ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, విద్యుత్ కొరత తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

**రెండు స్థానాలే లక్ష్యం**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించడంతో పాటు పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియను ఆషామాషీగా తీసుకోకుండా, ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని తరువాయి 2లో




# భారత్ ఆర్థిక వృద్ధి చైనా కంటే మెరుగ్గా ఉంది

### ప్రజల సాధికారతే లక్ష్యం

### ప్రస్తుతం దేశ వృద్ధిరేటు 7 శాతం

- పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానం
- డిజిటల్ నైపుణ్యాలే దేశ ఆర్థిక ప్రగతికి చోదకశక్తి
- బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రధాని

2

"భారత్ ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

2

### ఎల్బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు గ్రీన్‌సిగ్నల్

- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి అంగీకారం
- 5 రోప్‌వేలు, 3 ఆర్‌వోబీలకు అనుమతులు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ



## కేంద్రమంత్రి పదవికి మురుగన్ రాజీనామా

- తమిళనాడులో బీజేపీ బలోపేతమే లక్ష్యం
- రాజ్యసభ సభ్యత్వానికీ రాజీనామా చేస్తానని వెల్లడి
- 2029 ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకే నిర్ణయం
- కేంద్ర సహాయ మంత్రి పదవికి ఎల్. మురుగన్

2

చెన్నై: తమిళనాడులో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్రానికి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ తెలిపారు. ఈ నేపథ్యంలో తన మంత్రి పదవితోపాటు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ తరువాయి 2లో



## 2029లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మపరిశీలన చేసుకోవాలని అమిత్ షా సూచించారు. ఒకప్పుడు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న గుజరాత్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేకపోయిందని పేర్కొన్నారు. ఇటీవల మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు గెలుచుకోలేకపోయిందని విమర్శించారు. ఎన్నికల్లో ఓటములకు ఎన్నికల సంఘాన్ని బాధ్యురాలిగా చూపుతూ, బ్యాలెట్ పేపర్ల వినియోగాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడాన్ని అమిత్ షా తప్పుబట్టారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారానే కాంగ్రెస్ గతంలో పలు రాష్ట్రాల్లో విజయం సాధించిందని గుర్తుచేశారు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకు కల్పిత ప్రచారాలు, నిరంతర ఆరోపణలు చేస్తున్నంత మాత్రాన ప్రజల విశ్వాసాన్ని పొందలేరని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ పేరుతో చొరబాటుదారులకు రక్షణ కల్పించే ప్రయత్నాలను ప్రజలు ఇకపై అంగీకరించరని అమిత్ షా అన్నారు. రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలు వరుసగా నాలుగో ఓటమిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు మోదీ, బీజేపీ, ఎన్డీఏకు మద్దతుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఉపఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ, అసోంలోని నౌగావ్‌లో బీజేపీ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధించారని, పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్ స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు గెలుపొందారని అమిత్ షా తెలిపారు. పుదుచ్చేరిలో ఎన్డీఏ మిత్రపక్షమైన ఏఐఎన్ఆర్‌సీ అభ్యర్థి విజయం సాధించగా, కాంగ్రెస్‌కు తక్కువ ఓట్లు మాత్రమే లభించాయని పేర్కొన్నారు. ఈ ఫలితాలు ప్రతిపక్షాలు తమ రాజకీయ వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

### ప్రభుత్వ పాఠశాలల సరఫరా

## టెండర్లు రద్దు చేయాలి

**హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరుకుల సరఫరా కోసం ప్రవేశపెట్టిన ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ నూతన విధానం వల్ల స్థానిక చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆరోపించారు. గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగిస్తూ, పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ద్వారా స్థానిక వ్యాపారులకు సరఫరా బాధ్యతలు అప్పగించాలని కోరారు. స్థానిక వ్యాపారులకు అవకాశం కల్పించడం ద్వారా వారి ఉపాధికి భరోసా లభించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులను పక్కనపెట్టి, ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికే బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న సంస్థకు టెండర్లు కట్టబెట్టడం కమీషన్ల కోసం చేస్తున్న దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి, పాత సరఫరా విధానాన్ని పునరుద్ధరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

### శంషాబాద్ విమానాశ్రయంలో

## రూ.2.71 కోట్ల గంజాయి పట్టివేత

- ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి తరలింపు
- 7.750 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం
- బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడి అరెస్ట్



**హైదరాబాద్:** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ మొత్తంలో హైడ్రోపోనిక్ గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న 7.750 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.2.71 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు, అక్టోబర్ 12న బ్యాంకాక్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణించిన ఓ భారతీయుడిని తనిఖీ చేశారు. అతని చెక్–ఇన్ బ్యాగేజీలో ఉన్న ఎలక్ట్రిక్ గీజర్‌పై అనుమానం రావడంతో దాన్ని తెరిచి పరిశీలించారు. అందులో 73 ప్యాకెట్లలో దాచి ఉంచిన పచ్చని పదార్థాన్ని గుర్తించారు. నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా, అది గంజాయిగా నిర్ధారణ అయింది. దీంతో నిందితుడిని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం – 1985 కింద అరెస్ట్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అంతర్జాతీయ మార్గాల ద్వారా హైదరాబాద్‌కు అధిక నాణ్యత గల గంజాయిని అక్రమంగా తరలించడాన్ని అడ్డుకునే చర్యల్లో భాగంగా ఈ పట్టివేత జరిగినట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో నిందితుడి వివరాలను వెల్లడించలేదు.

### పద్మ అవార్డులతో సీఈసీలకు

## కాంగ్రెస్ ప్రయోజనాలు

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- మాజీ ఎన్నికల కమిషనర్లకు రాజకీయ పదవులు ఇచ్చారని ఆరోపణ



**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లకు పదవీ విరమణ తర్వాత రాజకీయ పదవులు, పద్మ అవార్డులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రయోజనం చేకూర్చిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో మంగళవారం దిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీ గతంలో వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ఎన్నికల కమిషనర్లుగా పనిచేసిన కొందరికి పదవీ విరమణ అనంతరం రాజకీయ పదవులు, పురస్కారాలు ఇచ్చారని గోయల్ పేర్కొన్నారు. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎం.ఎస్. గిల్‌కు పద్మవిభూషణ్ ఇచ్చారని, ఆర్.కె. త్రివేదిని 1986లో గుజరాత్ గవర్నర్‌గా నియమించారని గుర్తుచేశారు. మాజీ సీఈసీ టి.ఎన్. శేషన్‌ను ఎల్.కె. అద్వాణీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో నిలబెట్టారని ఆరోపించారు. రాహుల్ గాంధీ వ్యవహారశైలిపై కూడా విమర్శలు చేశారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరపకుండానే ఎన్నికల కమిషనర్ల నియామకాలు చేపట్టేదని గోయల్ అన్నారు. ఈ విధానానికి భిన్నంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2023లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేతకు కూడా స్థానం కల్పించినట్లు వివరించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషనర్లకు పద్మ అవార్డులను లంచంగా ఇచ్చిందన్న గోయల్ ఆరోపణలు ఆయన చేసిన రాజకీయ వ్యాఖ్యలుగా పేర్కొనాల్సి ఉంది.

# ఉగ్రవాదంపై భారత్ వెనక్కి తగ్గదు




**న్యూఢిల్లీ:** ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. బీఐఎంఎస్‌టీఈసీ దేశాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరకకుండా సభ్య దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను దాచడం, వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటి కార్యకలాపాలకు ఈ ప్రాంతంలో ఎలాంటి అవకాశం ఉండకూడదని చెప్పారు. దిల్లీలో మంగళవారం జరిగిన తొలి బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. సభ్య దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం ఉంటేనే ప్రాంతీయ భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు. ఒక దేశ భద్రతా వ్యవస్థ మరో దేశ భద్రతకు కూడా ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని దేశాలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని చెప్పారు.

ఉగ్రవాదులు ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లి దాక్కోవడం, అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, కొత్తవారిని నియమించుకోవడం, శిక్షణ ఇవ్వడం వంటి వాటిని అడ్డుకోవాలని అమిత్ షా అన్నారు. పొరుగు దేశాలపై దాడులకు ప్రణాళికలు వేయడం, వాటి కోసం వనరులను సమకూర్చుకోవడం వంటి చర్యలకు కూడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఒక దేశానికే పరిమితమైన సమస్య కాదని, దాని ప్రభావం అనేక దేశాలపై ఉంటుందని ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. అందువల్ల ప్రతి దేశం తన భద్రతను మాత్రమే కాకుండా, ఇతర సభ్య దేశాల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉగ్రవాదులను, వారి సహాయకులను గుర్తించేందుకు సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి పెరగాలని అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదుల వివరాలు, వారికి సహకరించే వ్యక్తులు, నేర ముఠాలు, వారి ఆర్థిక లావాదేవీలు, సరిహద్దులు దాటి జరిగే కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పంచుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సంబంధిత సంస్థల ద్వారా ఈ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఉగ్రవాదంపై పోరును మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంతోపాటు, దానికి అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం కూడా ముఖ్యమని అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే మార్గాలను గుర్తించి, వాటిని అడ్డుకోవాలని సభ్య దేశాలకు సూచించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ముఠాలపై కూడా కలిసి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేరాలకు పాల్పడిన వ్యక్తులను చట్టం ముందు నిలబెట్టేందుకు సభ్య దేశాలు పరస్పరం సహకరించుకోవాలని అన్నారు. ఆయా దేశాల చట్టాలు, కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణంగా న్యాయపరమైన సహాయం అందించుకోవడం, నిందితులను అప్పగించే విషయంలో సహకరించడం అవసరమని వివరించారు. ఇలాంటి చర్యల వల్ల నేరగాళ్లను పట్టుకోవడం సులభమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరో పెద్ద సమస్యగా మారిందని అమిత్ షా చెప్పారు. ఈ అక్రమ రవాణాను ఒక్క దేశం మాత్రమే అడ్డుకోలేదని, అన్ని దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా వచ్చే డబ్బు నేర ముఠాలకు బలాన్ని ఇస్తోందని, అదే డబ్బును ఉగ్రవాద కార్యకలాపాలకు కూడా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల తయారీలో ఉపయోగించే రసాయనాలను అక్రమంగా మళ్లించడం, డార్క్ వెబ్ ద్వారా లావాదేవీలు జరపడం వంటి చర్యల వల్ల ఈ సమస్య మరింత క్లిష్టంగా మారుతోందని చెప్పారు. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి ఒక్కో దేశం విడివిడిగా ప్రయత్నించడం కాకుండా, మొత్తం ప్రాంతం ఒకటిగా భావించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉగ్రవాదం, నేర ముఠాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు.

## కేంద్రమంత్రి పదవికి మురుగన్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)



రాసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన సమాచార, ప్రసార శాఖతోపాటు పార్లమెంటరీ వ్యవహారాల శాఖలో సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమిళనాడులో పార్టీని బలోపేతం చేసి, 2029 సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం చేయడమే తన లక్ష్యమని మురుగన్ పేర్కొన్నారు. మంత్రి బాధ్యతల నుంచి తనను తప్పించి, పార్టీ కోసం పనిచేసే అవకాశం కల్పించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. ఇటీవల తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించిన సందర్భంగా ఆయనకు ప్రజల నుంచి లభించిన ఆదరణను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. తమిళుల ఆత్మగౌరవాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మోదీ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రధాని నాయకత్వంలో పనిచేయడం తనకు గొప్ప గౌరవమని మురుగన్ పేర్కొన్నారు. దేశం, తమిళనాడు, బీజేపీ పట్ల తనకున్న అంకితభావం మరింత పెరిగిందని తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశానికి, తమిళనాడుకు సేవ చేయడాన్ని తన జీవితంలో లభించిన అత్యంత గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. పెట్రోలియం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న హర్దీప్ సింగ్ పూరీని రాజ్యసభకు నామినేట్ చేయకపోవడంపై చర్చ జరుగుతున్న సమయంలో మురుగన్ రాజీనామా ప్రకటన వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## భారత్ ఆర్థిక వృద్ధి చైనా కంటే మెరుగ్గా ఉంది



**న్యూఢిల్లీ:** భారత్ ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డిజిటల్ నైపుణ్యాలు దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దిల్లీలో మంగళవారం జరిగిన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో పాల్గొన్న ఆయన, దేశ ఆర్థిక వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల అవకాశాలు, ప్రజల సాధికారతపై మాట్లాడారు. అధికారం ఎవరి చేతిలో ఉందన్నది కాకుండా, ప్రజల ప్రయోజనాల కోసం దాన్ని ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యమని మోదీ పేర్కొన్నారు. సాంకేతికత, డేటా, జ్ఞానం, ఆవిష్కరణలు నేటి ప్రపంచంలో కీలకమైన శక్తి వనరులుగా మారాయని చెప్పారు. వీటి ద్వారా లక్షలాది మందికి కొత్త అవకాశాలు కల్పించాలని సూచించారు. సాంకేతిక పురోగతి ప్రయోజనాలు కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఆకాంక్షించారు. నియంత్రణ కంటే సాధికారతకు, పోటీ కంటే సహకారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని అన్నారు. వ్యక్తిగత విజయంతో పాటు ఇతరులు అభివృద్ధి సాధించేందుకు తోడ్పడే దృక్పథం అవసరమని పేర్కొన్నారు. జ్ఞానం, సంపద, అధికారాన్ని ఉన్నత లక్ష్యాల సాధనకు వినియోగించాలనే భావన భారతీయ సంప్రదాయంలో భాగమని వివరించారు. అధికారం విలువ దాని వినియోగంలోనే ఉంటుందని తెలిపారు. బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌ను తొలిసారిగా భారత్‌లో నిర్వహించడాన్ని మోదీ స్వాగతించారు. ఆర్థిక వ్యవస్థ, ఇంధనం వంటి అంశాలపై చర్చించే ఈ వేదికకు భారత్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని అన్నారు. మైఖేల్ బ్లూమ్‌బర్గ్ సరైన సమయంలో సరైన ప్రదేశాన్ని ఎంచుకున్నారని వ్యాఖ్యానించారు.

### ప్రపంచంతో కలిసి ఎదుగుతాం

భారత్ అభివృద్ధి ప్రపంచానికి నష్టం కలిగించే విధంగా కాకుండా, ఇతర దేశాలతో కలిసి సాగుతుందని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి అని అభివర్ణించారు. దేశంలోని భాషా వైవిధ్యం, విభిన్న మీడియా వేదికలు, సామాజిక మాధ్యమాల వినియోగం ప్రజలకు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత్ డిజిటల్ వ్యవస్థ వివిధ రంగాల వ్యాపారాలకు ప్రయోజనం కలిగిస్తోందని మోదీ వివరించారు. దేశ ఆర్థిక వృద్ధిలో డిజిటల్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భారత్‌ను సందర్శించే విదేశీ అతిథులు దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను వినియోగించి చూడాలని సూచించినట్లు తెలిపారు. వీధి వ్యాపారి నుంచి కార్ల షోరూమ్ నిర్వాహకుడి వరకు భిన్న స్థాయిల్లో వ్యాపారాలు నిర్వహించే వారంతా ఒకే డిజిటల్ చెల్లింపుల వేదికను ఉపయోగించగలగడం సమ్మిళిత సాంకేతికతకు ఉదాహరణ అని ప్రధాని పేర్కొన్నారు. డిజిటల్ నైపుణ్యాలను మరింత విస్తరించడం ద్వారా ప్రజలకు అవకాశాలు పెరుగుతాయని, భవిష్యత్తులో భారత్ పెట్టుబడులకు ఆకర్షణీయమైన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)



పేర్కొన్నారు.నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్‌నగర్ స్థానానికి సామా రామ్మోహన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అభ్యర్థులు, పార్టీ నేతలను కలిసి తమ గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు.

### కరవు, విద్యుత్ కొరతపైనా చర్చ

మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, విద్యుత్ కొరత అంశాలూ చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను వాస్తవాలతో తిప్పికొట్టాలని సీఎం సూచించినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ నేతలకు దిశానిర్దేశం చేశారు.

### ముగిసిన టీకాంగ్రెస్ ఢిల్లీ పర్యటన

ఢిల్లీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాత్రి 8 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి, రోహిన్ రెడ్డిలు ఢిల్లీ నుంచి బయలుదేరారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఆదివారం దిల్లీ వెళ్లిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కలిశారు.

## రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

**న్యూఢిల్లీ:** తెలంగాణలో చేపట్టనున్న పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. దిల్లీలో గడ్కరీతో భేటీ అయిన ఆయన రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి, వంతెనల నిర్మాణం, రవాణా సౌకర్యాల విస్తరణకు సంబంధించిన పలు ప్రతిపాదనలను వివరించారు. ఎల్బీనగర్ – హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించినట్లు తెలిపారు. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే జాతీయ రహదారి – 167 ద్వారా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రవాణా అనుసంధానం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు పర్యాటక రంగానికి కూడా ఊతం లభిస్తుందని వివరించారు. హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారి – 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని గడ్కరీ అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. పర్వతమాల పథకం కింద తెలంగాణలో ఐదు రోప్‌వేల నిర్మాణానికి ఆమోదం లభించిందని కోమటిరెడ్డి చెప్పారు. సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌వోబీలు) నిర్మాణానికి కూడా అనుమతులు వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి నిధులు మంజూరు చేయాలని కోరగా, సంబంధిత అధికారులకు గడ్కరీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పలు రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కూడా కేంద్ర మంత్రిని కోరినట్లు వివరించారు. పుల్లూరు – అల్లంపూర్ – జట్రపోలు – పెంట్లవెల్లి – కొల్లాపూర్ – లింగాల – అచ్చంపేట – డిండి – దేవరకొండ – మల్లేపల్లి – నల్గొండ మార్గాలను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై సానుకూల స్పందన వచ్చినట్లు చెప్పారు. హైదరాబాద్ – విజయవాడ – మచిలీపట్నం మార్గంలో జాతీయ రహదారి – 65 విస్తరణ పనులను వేగవంతం చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు కోమటిరెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల మెట్రో రైలు మార్గం, అదే మార్గంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 5.5 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. తాజాగా డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం లభించిందని వెల్లడించారు.

### ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు ఆహ్వానం

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలకు హాజరు కావాలని నితిన్ గడ్కరీని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆహ్వానించారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కేంద్రం సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

## దేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు విదేశీ శక్తులతో కలిసి దేశంలో అశాంతి సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. దిల్లీలో నిరసనల పేరుతో దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రతిపక్ష పార్టీల ఆందోళనలపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల నిరసనల వల్ల ఢిల్లీ మార్కెట్ దెబ్బతిన్నదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో చిన్న వ్యాపారులు సరుకులు తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. నిరసనలతో ప్రజల సాధారణ జీవనానికి ఆటంకం కలుగుతోందని, వ్యాపారులు నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదనే కారణంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే రాజ్యాంగబద్ధ సంస్థలపై విశ్వాసాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం తగదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే



**న్యూఢిల్లీ:** లద్దాఖ్ విషయంలో చైనా చేస్తున్న వాదనలను భారత్ తోసిపుచ్చింది. లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమని మరోసారి స్పష్టం చేసింది. చైనా ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఈ వాస్తవం మారదని తేల్చిచెప్పింది. లద్దాఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలకు అధికారిక పేర్లను ఖరారు చేసి, భారత మ్యాప్‌లలో చేర్చడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన వివాదం తెరపైకి వచ్చింది.కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని భౌగోళిక ప్రాంతాలకు పేర్లను ఖరారు చేసే ముందు అక్కడి పరిపాలనా విభాగాలు, స్థానిక ప్రజలు, ఇతర భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు జరిపినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లలో ఈ పేర్లను చేర్చినట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలను మ్యాప్‌లలో స్పష్టంగా గుర్తించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు వాటిని కచ్చితంగా గుర్తించేందుకు వీలవుతుందని వివరించారు.

### చైనా తీవ్ర అభ్యంతరం

లద్దాఖ్‌లోని ప్రాంతాలకు ప్రామాణిక పేర్లను కేటాయించాలన్న భారత్ నిర్ణయాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. భారత్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని తాము గుర్తించడం లేదని పేర్కొంది. భారత ప్రభుత్వం ప్రకటించిన పేర్లను కూడా అంగీకరించబోమని స్పష్టం చేసింది. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ మంగళవారం బీజింగ్‌లో మీడియాతో మాట్లాడుతూ, భారత్ తీసుకున్న చర్య చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించారు. చైనా – భారత్ సరిహద్దులోని పశ్చిమ ప్రాంతం చైనాకు చెందిందన్న తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని, భారత నిర్ణయం వల్ల సరిహద్దులపై తమ అభిప్రాయం మారదని పేర్కొన్నారు. లద్దాఖ్‌లోని కీలక ప్రాంతాలను భారత అధికారిక మ్యాప్‌లలో గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెల 2న చర్యలు చేపట్టింది. కేంద్ర హోం శాఖ, లద్దాఖ్ పరిపాలనా యంత్రాంగం సమన్వయంతో 28 ప్రాంతాలు, పర్వతాలు, లోయలు, హిమానీనదాలు, పర్వత మార్గాలకు పేర్లు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ జాబితాలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి వ్యూహాత్మక ప్రాంతాలు కూడా ఉన్నాయి. సరిహద్దు ప్రాంతాలను స్పష్టంగా గుర్తించడం వల్ల అధికారిక రికార్డుల నిర్వహణతో పాటు భారత సైన్యం గస్తీ కార్యకలాపాలకు ఉపయోగం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

### 2020 నుంచి సరిహద్దు ఉద్రిక్తతలు

తూర్పు లద్దాఖ్‌లో 2020 మే 5న పాంగాంగ్ సరస్సు సమీపంలో భారత్, చైనా సైనికుల మధ్య ఘర్షణ జరగడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అనంతరం సరిహద్దు వివాద పరిష్కారానికి ఇరు దేశాలు పలు దఫాలుగా చర్చలు జరిపాయి. 2022లో కొన్ని ప్రాంతాల నుంచి సైనిక బలగాలను వెనక్కి తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి ప్రాంతాలకు వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి కీలక ప్రదేశాలను స్పష్టంగా గుర్తించడం సైనిక గస్తీ, సరిహద్దు నిర్వహణకు తోడ్పడుతుంది.

### పర్వతాలు, హిమానీనదాలకు పేర్లు

భారత్ ఖరారు చేసిన జాబితాలో అలీషా గిరి, బ్రంగ్సా, చాప్చింగల్ పాస్, కనిష్క శిఖరం, కరుణ్ పీర్ పర్వతం, కుక్సెల్, మార్తాండ్ గిరి, పర్సిక్ హిమానీనదం, స్కామి హిమానీనదం, షాచ్మిరిక్ పాస్, ష్కోర్గా లోయ, జోరావర్ శిఖరం వంటి ప్రాంతాలు ఉన్నాయి. అలాగే డెప్రా కంపాస్, డ్రాక్ కార్పో, జోల్మోరి, జ్చెనాంగ్, కుమారాయనా పాలింట్, పాన్‌కియాంగ్‌ల్, గురు రిన్‌పోచే, షామల్ లుంగ్‌పా, యాంగ్‌పా నది, మార్ప లోత్సవ రి, మిలరేప కాంగ్రి, శివ రి, మహేశ్వర రి తదితర ప్రాంతాలకు కూడా పేర్లు ఖరారు చేసినట్లు వెల్లడైంది.

# ఢిల్లీలో 'చేతి' శ్రేణులపై ఖాకీల ప్రతాపం

o శాంతియుత నిరసనపై పోలీసుల బలప్రయోగం సిగ్గుచేటు

o మల్‌రెడ్డి రాంరెడ్డికి గాయాలవడంపై పన్యాల జైపాల్‌రెడ్డి ఆందోళన

o ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలి





**తొలివెలుగు, ఎల్బీనగర్ :** ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు బలప్రయోగం చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ ఘటనలో తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఆర్‌డీసీ) చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి గాయపడటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కును కాలరాసేలా వ్యవహరించడం సరికాదని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పన్యాల జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# వెండి కుదువ పేరిట మార్వాడీ టోకరా!

o రూ.30 వేల అప్పుకు రూ.90 వేలు వసూలు.. చివరకు నకిలీల చేతివాటం

o దుకాణం ముందు బాధితురాలి రాస్తారోకో/నిరసన.. ఆత్మకూరులో బద్దలైన గుట్టు






**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** అప్పుల ఊబిలో చిక్కుకున్న సామాన్యులను నిలువునా దోచుకుంటున్న వడ్డీ వ్యాపారి బండారం ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో బట్టబయలైంది. 70 తులాల విలువైన వెండిని కుదువపెట్టి రూ.30 వేలు అప్పు తీసుకున్న ఓ మహిళను మార్వాడీ వ్యాపారి నిలువునా మోసం చేశాడు. రూ.30 వేల అప్పుకు ఏకంగా రూ.90 వేలు వసూలు చేయడమే కాకుండా, చివరికి అసలైన వెండికి బదులు నకిలీ వెండిని కట్టబెట్టిన వైనం స్థానికంగా సంచలనం సృష్టించింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో గతంలో దుకాణం నిర్వహించిన మార్వాడీ వ్యాపారి రాంనివాస్ వద్ద సదరు మహిళ 70 తులాల వెండిని తన అవసరాల నిమిత్తం తాకట్టు పెట్టి రూ.30 వేలు తీసుకుంది. అయితే, కాలక్రమేణా తిరుమలగిరిలో షాపు మూసివేసిన ఆ వ్యాపారి.. ఎవరికీ చెప్పకుండా ఆత్మకూరు (ఎం)కు మకాం మార్చి 'కృష్ణ జువెలర్స్' పేరుతో దుకాణం తెరిచాడు. విషయం తెలుసుకున్న బాధితురాలు ఆత్మకూరుకు వెళ్లగా, వ్యాపారి తన ప్రతాపం చూపించాడు. చక్రవడ్డీలంటూ లెక్కలు మార్చి రూ.30 వేల అప్పుకు ఏకంగా రూ.90 వేల నగదును గుంజుకున్నాడు. అంతటితో ఆగకుండా, డబ్బులన్నీ వసూలు చేసుకున్న తర్వాత ఆమెకు నకిలీ వెండిని అంటగట్టాడు. తాను మోసపోయానని గ్రహించిన మహిళ విస్తుపోయి, వ్యాపారి దుకాణం ఎదుట తీవ్ర నిరసనకు దిగింది. మూడు రెట్లు చెల్లించినా తనకు జరిగిన మోసాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. ఈ వ్యవహారంపై పోలీసుల ఎంట్రీ, అధికారిక విచారణ ఎటు దారి తీస్తుందోనని స్థానికంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# ఆసుపత్రి వద్ద సంస్కృతీ సంప్రదాయాల వేడుక

- రాజపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ ఆడిన సిబ్బంది
- వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్ ఆధ్వర్యంలో సంబరాలు
- హాజరైన వైద్యులు, ఆశా కార్యకర్తలు

**తొలివెలుగు, రాజాపేట :** రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రాంగణంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు కన్నులపండువగా జరిగాయి. స్థానిక వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రాంగణంలోనే ఈ వేడుకలను నిర్వహించారు. ఆసుపత్రి ముందు భాగాన వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, వైద్యులు, సిబ్బంది చుట్టూ తిరుగుతూ జానపద పాటలతో బతుకమ్మ ఆడారు. వైద్య సేవలతో పాటు ఈ విధంగా సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం అభినందనీయమని వైద్యాధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందన, సీహెచ్ఓ విజయరాణి, హెచ్ఈఓ భీకూ నాయక్, విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సౌజన్య, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# దేవుళ్లనూ వెంటాడిన కరువు..
# పాతాళానికి భూగర్భ జలాలు



- జిల్లాలో దెబ్బతిన్న వరి, పత్తి, కంది పంటలు.. అడుగంటన జలాశయాలు
- ఎల్‌నినో దెబ్బకు నిమజ్జనాలకూ తిప్పలే.. నీటీ కోసం ట్యాంకర్ల ఆశ్రయం
- 13 మండలాల్లో తీవ్ర వర్శాభావం.. కేంద్ర కరువు బృందాల రాకకు కసరత్తు

**వర్షపాతం వివరాలు** (మ.మీ.లలో)

| నెల | కురవాల్సింది | కురిసింది | లోటు / అధికం |
|---|---|---|---|
| జూన్ | 99.2 | 68.2 | ▼ 31% |
| జూల్లై | 137.1 | 89.3 | ▼ 35% |
| ఆగస్టు | 139.3 | 87.6 | ▼ 37% |
| సెప్టెంబరు | 154.9 | 168.7 | ▲ 13% |

**తొలివెలుగు, రాజాపేట :** ఎల్‌నినో ప్రభావం యాదాద్రి భువనగిరి జిల్లాను తీవ్రంగా చుట్టుముట్టింది. వానాకాలం సీజన్‌లో కనీసం సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో జిల్లావ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా పొలాల్లో ఉన్న వరి, పత్తి, కంది పంటలు ఎండిపోతుంటే.. ఇంకోవైపు కరువు ప్రభావం దేవుళ్లను కూడా వెంటాడుతోంది. జలాశయాలు, చెరువులు, కుంటల్లో నీళ్లు లేక వినాయక నిమజ్జనం నుంచి మొదలుకొని ప్రస్తుత బతుకమ్మ, రాబోయే దుర్గామాత విగ్రహాల నిమజ్జనాల వరకు భక్తులకు కష్టాలు తప్పడం లేదు. రాజపేట మండలంతో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో నిమజ్జనాల కోసం సర్పంచులు ట్యాంకర్ల ద్వారా కుంటలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెరువులలో నీటిని నింపుతున్నారు. బతుకమ్మకు అవసరమైన పూల కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది.

**పాతాళానికి భూగర్భ జలాలు.. కష్టాల్లో తాగు, సాగు నీరు:**

జిల్లాలో భూగర్భ జలాలు ఆందోళనకర రీతిలో అడుగంటాయి. సగటు నీటిమట్టం భూమి ఉపరితలం దిగువన 10.58 మీటర్ల లోతుకు పడిపోయింది. గతేడాది సెప్టెంబర్ నాటికి జిల్లా సగటు నీటిమట్టం 7.15 మీటర్లు ఉండగా, ఈ ఏడాది ఏకంగా 3.43 మీటర్ల (దాదాపు 11.31 అడుగులు) మేర నీటిమట్టం పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మిషన్ భగీరథ ద్వారా వస్తున్న 30 ఎంఎల్డీల నీరు సరిపోకపోవడంతో, సుమారు 200 గ్రామాల్లో వ్యవసాయ, ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకుని నీటిని అందిస్తున్నారు.

**కుదేలైన వ్యవసాయం.. పడిపోయిన దిగుబడులు:**

జిల్లాలోని 17 మండలాలకు గాను 13 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తుర్కపల్లి, ఆత్మకూరు (ఎం), మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా, బీబీనగర్, భువనగిరి మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం రికార్డైంది. సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. గత ఏడాది పత్తి ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రాగా, ప్రస్తుతం కేవలం 40 నుంచి 60 కిలోలకు పడిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పైర్లు నీళ్లందక ఎండిపోతున్నాయి.

**కేంద్ర బృందాల రాకకు సన్నాహాలు:**

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదికలు పంపించింది. కేంద్ర కరువు అధ్యయన బృందాలు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో వ్యవసాయ, భూగర్భ జలవనరులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్లానింగ్ శాఖల అధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.





# పరిశుభ్రతే ధ్యేయం.. చెత్త వేరుచేయడం బాధ్యత




- తంగడపల్లి 5వ వార్డులో తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ
- పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: కౌన్సిలర్ శేఖర్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు మరియు తడి-పొడి చెత్తను ఇంట్లోనే వేరుచేసే సంస్కృతిని ప్రోత్సహించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగడపల్లి 5వ వార్డులో మంగళవారం ఇళ్ల స్థానిక నివాసితులకు తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇళ్లలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను ప్రారంభంలోనే తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందజేయడం వల్ల పారిశుధ్య కార్మికుల పని సులువవుతుందన్నారు. వంటగది వ్యర్థాలు, కూరగాయల తొక్కలు వంటివాటిని ఆకుపచ్చ బుట్టలో (తడి చెత్త), ప్లాస్టిక్, కాగితాలు, గాజు ముక్కలు వంటి వ్యర్థాలను నీలిరంగు బుట్టలో (పొడి చెత్త) ప్రత్యేకంగా వేయాలని ప్రజలకు సూచించారు. మున్సిపల్ సిబ్బందితో పాటు వార్డు ప్రజలు కూడా భాగస్వాములైతేనే వార్డును సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్చార్జి భాష, సానిటరీ డిపార్ట్మెంట్ అధికారి హనుమాన్ ప్రసాద్, వార్డు ప్రకృతి వనం ఇన్చార్జ్ రేణు కుమార్, వార్డు మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# విపత్తుపై రాజకీయాలా?

- కేంద్ర మంత్రులతో మాట్లాడి నిధులు తీసుకురండి
- బిజెపి ఆందోళనలపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



**తొలివెలుగు, రాజాపేట:** వాతావరణ మార్పులు, ఎల్ నినో ఎఫెక్ట్ వల్ల ఏర్పడుతున్న పరిస్థితులను బిజెపి నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. రాజాపేట మండలంపై బిజెపికి నిజంగా ప్రేముంటే కేంద్ర మంత్రులను కలిసి ప్రత్యేక నిధులు తీసుకురావాలని సవాల్ విసిరారు. మంగళవారం రాజాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వస్తున్న ఇబ్బందులు తెలిసి కూడా బిజెపి నాయకులు ఆందోళనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, గతంలో రాష్ట్రంలో ఏలిన బిఆర్ఎస్ (టిఆర్ఎస్) కలిసి మండలానికి సాధించిందేమీ లేదని విమర్శించారు. కొండపోచమ్మ 15వ ప్యాకేజీ పనులను కాంట్రాక్టు రద్దు చేసి, నూతన యంత్రాలు, రూ.54 కోట్ల నిధులతో సింగారం నుంచి లక్ష్మక్కపల్లి వరకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషి చేస్తున్నారని తెలిపారు. గంధమల్ల ప్రాజెక్టును సందర్శిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. రాజకీయం కాకుండా రైతాంగం కోసం కేంద్రం నుంచి నిధులు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు సిల్వేరు బాలరాజు గౌడ్, మడోత్ విఠల్ నాయక్, నాయకులు పిట్టల జయరాములు, పెండికూర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణగా దర్శనమిచ్చిన జగన్మాత



- ం నవరాత్రి ఉత్సవాల్లో మహోజ్వలంగా పూజలు
- ం ప్రత్యేక పూజల్లో బిజెపి జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్

**తొలివెలుగు, రాజాపేట:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజాపేట మండల కేంద్రంలో మంగళవారం శ్రీ దుర్గామాత అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెంబు, గరిట ధరించి దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకరణ విశిష్టతను అర్చకులు చలివేదుల రాజేశ్వర శర్మ, హేమంత్ భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహం కూడలి వద్ద కొలువుదీరిన దుర్గామాత వద్ద విగ్రహ దాత గౌటే ప్రశాంత్, మహనీయుల విగ్రహాల కూడలి వద్ద విగ్రహ దాత వరిమడ్ల కనకరాజు కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. పూజానంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





# అన్నపూర్ణాదేవిగా 'మద్దెలమ్మ'.. వైభవంగా లక్ష పుష్పార్చన

- వైభవంగా శరన్నవరాత్రి మూడో రోజు వేడుకలు - ముక్కుపుడక లక్కీ లాటరీ మొదటి విజేత దివ్య

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పురపాలక కేంద్రంలోని శ్రీ మద్దెలమ్మ దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి శోభాయమానంగా లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పండితుల మంత్రోచ్ఛారణల నడుమ భక్తులు వివిధ రకాల పుష్పాలతో దేవికి విశేష అర్చనలు చేశారు. అనంతరం దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన 9 బంగారు ముక్కుపుడకల లక్కీ డ్రాలో భాగంగా మొదటి ముక్కుపుడక డ్రాను ఆలయ చైర్మన్ సురపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ డ్రాలో దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన దివ్య అనే భక్తురాలు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా చైర్మన్ రాము మాట్లాడుతూ.. మిగిలిన 8 బంగారు ముక్కుపుడకల లాటరీ డ్రాను దసరా ముందు రోజు నిర్వహిస్తామని తెలిపారు. పూజల అనంతరం భక్తులకు మహా అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కడవెర్ రాము, ఉపాధ్యక్షుడు చింతకింది దామోదర్, సహాయ కార్యదర్శి సీతా రాజేంద్రప్రసాద్, కోశాధికారి తారక వెంకటేష్, ప్రచార కార్యదర్శి సీత చందు, ధర్మకర్తలు పాల్గొన్నారు.



# కరెంటు కోతలపై అన్నదాతల నిరసన

- దూది వెంకటాపురం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన

**తొలివెలుగు, రాజాపేట:** నానాటికీ తీవ్రమవుతున్న విద్యుత్తు కోతలతో తీవ్రంగా నష్టపోతున్నామంటూ రైతులు ఆందోళన బాట పట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం దూది వెంకటాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. అప్రకటిత కరెంటు కోతల వల్ల పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని, వ్యవసాయానికి వేళాపాళా లేకుండా విద్యుత్ నిలిపివేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ వద్ద ప్రభుత్వానికి, విద్యుత్ శాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# ముదిరాజ్ సంఘం సోషల్ మీడియా కన్వీనర్‌గా జగదీష్

- ం ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండల కమిటీ

**తొలివెలుగు, రాజాపేట:** ముదిరాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోషల్ మీడియా కన్వీనర్‌గా యామ జగదీష్ ముదిరాజ్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజాపేటలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. సంఘం ఐక్యతకు, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో ముదిరాజ్ సంఘం చేపడుతున్న సేవా, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కమిటీ సభ్యులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.





# అమ్మవారి కృపతోనే సుభిక్షంగా రాష్ట్రం: మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

- ం ఘనంగా చిట్యాలలో కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలు
- ం పాలుపంచుకున్న ప్రముఖులు, భక్తులు

**తొలివెలుగు, చిట్యాల :** భక్తిభావం, ఆధ్యాత్మిక చింతన మనిషికి మానసిక ప్రశాంతతను చేకూరుస్తాయని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ 10వ వార్డులో యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల సందర్భంగా స్థానిక నాయకులు బొబ్బల శివశంకర్ రెడ్డి, శ్వేత దంపతులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేయగా.. మాజీ ఎమ్మెల్యే దానిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూరెళ్ళ లింగస్వామి, మెండే సైదులు, కౌన్సిలర్ షేక్ షబానా అజీమ్, కల్లూరి మల్లారెడ్డి, జిట్ట బొందయ్య, ఆగు అశోక్, జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, నర్రా బిక్షంరెడ్డి, బోల్గూరి సైదులుతో పాటు యువజన సంఘం సభ్యులు చింతపల్లి ప్రవీణ్, తీగల శివ, సిలివేరు రిశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# వరాహ అవతారంలో వెంకన్న.. భక్తులకు కనువిందు

- ం కృష్ణలో వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- ం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు
- ం గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం



**తొలివెలుగు, కృష్ణ :** కృష్ణా మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు వరాహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు నారాయణ భట్, సురేష్ భట్‌లు స్వామివారి వరాహ అవతార విశిష్టతను భక్తులకు వివరించారు. పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# కార్మికుల ముఖాల్లో 'దసరా' కాంతులు

- ం తల్లిదండ్రుల పేరిట నూతన వస్త్రాల పంపిణీ
- ం జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చిలకల సంతోష్ యాదవ్ ఉదారత

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** గ్రామ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ వేళ గౌరవం అందించాలనే లక్ష్యంతో భూదాన్ పోచంపల్లి మండలం శివరెడ్డిగూడెంలో నూతన వస్త్రాల పంపిణీ చేపట్టారు. మంగళవారం స్థానిక గ్రామ ఉపసర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చిలకల సంతోష్ యాదవ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులందరికీ కొత్త దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని ప్రతినిత్యం శుభ్రంగా ఉంచుతూ, ప్రగతి బాటలో వారధులుగా నిలుస్తున్న కార్మికుల సేవలు అమూల్యమైనవన్నారు. పండుగ పూట వారి ముఖాల్లో ఆనందం నింపేందుకే ఈ నూతన వస్త్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజిత, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, పిఎసిఎస్ డైరెక్టర్ వారాల రామచంద్ర రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, సరసాని నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

- లక్ష్యాల సాధనకు ప్రత్యేక దృష్టి సారించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీ హెచ్ సీ) వైద్యాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా వైద్య సేవలు, గర్భిణుల నమోదు, అంటెనాటల్ కేర్ (ఏ ఎన్ సీ) పరీక్షలు, ప్రసవానంతర సేవలు, చిన్నపిల్లల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన గర్భిణులందరికీ సకాలంలో వైద్య పరీక్షలు అందేలా చూడాలని, హైరిస్క్ గర్భిణులను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో ఏమాత్రం అలసత్వం వహించవద్దని, వైద్యాధికారులందరూ సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ మనోహర్, వివిధ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి ప్రాంగణంలో 'పూల' సంబరం

- చౌటుప్పల్ సీహెచ్‌సీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- రంగురంగుల పూలతో వార్డుల అలంకరణ, ఆయుధ పూజ
- పాల్గొన్న పురపాలక ఛైర్‌పర్సన్ మోగుదాల పావని, సీనియర్ వైద్యులు





**తొలివెలుగు, చౌటుప్పల్:** రంగురంగుల పూల పరిమళాలు.. లయబద్ధమైన చప్పట్లు.. మధురమైన పాటలతో చౌటుప్పల్ బంగారుగడ్డలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) మంగళవారం కోలాహలంగా మారింది. తెలంగాణ సాంస్కృతిక ప్రతీకైన బతుకమ్మ పండుగను ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులు, నర్సింగ్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది అత్యంత ఘనంగా నిర్వహించారు. నిత్యం రోగుల సేవల్లో, వైద్య పరీక్షల్లో బిజీగా ఉండే తెల్ల కోటు వైద్యులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని నింపారు. ఉదయం నుంచే ఆసుపత్రిలోని అన్ని వార్డులను తీరొక్క పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆసుపత్రికి సంబంధించిన వైద్య పరికరాలకు, ప్రాంగణానికి పూజారులు ఆయుధ పూజ నిర్వహించారు. ఆ తర్వాత వైద్యాధికారులు, సిబ్బంది స్వయంగా పలురకాల తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలను తెచ్చి రంగురంగుల బతుకమ్మలను తీర్చిదిద్దారు. ఆసుపత్రి ఎదుట బతుకమ్మలను ప్రతిష్టించి మహిళా వైద్యులు, సిబ్బంది చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా ఆడారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలోని అమ్మవారికి పూజలు చేసి నైవేద్యంగా బోనాన్ని సమర్పించారు. ఈ వేడుకలకు చౌటుప్పల్ పురపాలక ఛైర్‌పర్సన్ మోగుదాల పావని, బత్తుల జయమ్మ ముఖ్య అతిథులుగా హాజరై బతుకమ్మ ఆడారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ సూర్యశ్రీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ చంద్రశేఖర్, వైద్యాధికారులు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ వరలక్ష్మి ప్రియ, డాక్టర్ కావేరి, డాక్టర్ నజీమా, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అవినాష్, సీనియర్ అసిస్టెంట్లు జయమ్మ, కవిత, నర్సింగ్ సూపరింటెండెంట్లు భాగ్యమ్మ, రజనీ లక్ష్మి, హెడ్ నర్సులు అనంత, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు పురపాలక ఛైర్‌పర్సన్ మోగుదాల పావని, డీసీహెచ్ఎస్ సూర్యశ్రీరావు చేతుల మీదుగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం సిబ్బందికి బతుకమ్మ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

## సాయిరాం కాలనీ వాసుల 30 ఏళ్ల కల సాకారం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో, కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయిరాం కాలనీలో హెచ్ఎండీఏ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ బిక్షపతి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో పనులను వేగవంతం చేశారు. సాయిరాం కాలనీలో రోడ్డు సదుపాయం లేక కాలనీవాసులు గత 30 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఈ రోడ్డు నిర్మాణంతో పరిష్కారం లభించనుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ చిరకాల వాంఛ నెరవేరుస్తున్న సర్పంచ్ బిక్షపతి, పాలకమండలి సభ్యులను అభినందించారు.

# ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతిరెడ్డి' నియామకం

- ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతిరెడ్డి'
- ఆమె నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- గత ఎన్నికల ముందు సోషల్ మీడియాలో వేధింపులు ఎదుర్కొన్న స్వాతిరెడ్డి
- కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచినందుకు టీడీపీ ప్రభుత్వంలో గుర్తింపు



**తొలివెలుగు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా 'స్వాతి రెడ్డి' (గౌతమి శ్వేత కోట) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీకి గట్టి మద్దతుదారురాలిగా ఆమెకు గుర్తింపు ఉంది. గత ఎన్నికల ముందు 'స్వాతిరెడ్డి' సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన వేధింపులను, ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఆమె టీడీపీకి మద్దతుగా తన గళాన్ని బలంగా వినిపించారు. ప్రతికూల పరిస్థితుల్లో, వేలాది మంది నుంచి ఆన్‌లైన్‌లో విమర్శలు ఎదురైనప్పటికీ ఆమె వెనకడుగు వేయకుండా పార్టీ వైఖరికి కట్టుబడి నిలిచారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తోంది. ఈ క్రమంలో 'స్వాతిరెడ్డి' సేవలను గుర్తించి, ఆమెకు మహిళా కమిషన్‌లో సభ్యురాలిగా కీలక బాధ్యతలు అప్పగించారు. ఆమె నియామకంపై టీడీపీ శ్రేణులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతి నుంచి ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి.

**లోకేశ్ అన్న చెప్పింది ముమ్మాటికీ నిజం: స్వాతిరెడ్డి**

తన నియామకంపై స్వాతిరెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. " నన్ను గుర్తించిన నా దేవుడు, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే నన్ను గుర్తించిన నా అన్న లోకేశ్ గారికి సదా ఋణపడి ఉంటాను. ఈ రోజు మీరు నాకు ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీరు నా మీద పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. "కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్న చెప్పిన మాటలు ముమ్మాటికీ నిజం. కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు నా పార్టీ తెలుగుదేశం కోసం కష్టపడుతూనే ఉంటాను" అంటూ ట్వీట్ చేశారు.

# ఆమ్రపాలిక్యాడర్ వివాదం.. హైకోర్టులో తీర్పు రిజర్వ్

**తొలివెలుగు, అమరావతి:** సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది. దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# పరుగులు పెట్టనున్న మెట్రో ఫేజ్–2.. పర్యవేక్షణ సంస్థల నియామకంపై హెచ్ఎంఆర్ఎల్ ఫోకస్

**తొలివెలుగు, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ పనులు వేగం పుంజుకుంటున్నాయి. ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు అత్యంత ముఖ్యమైన జనరల్ కన్సల్టెన్సీ (జీసీ)ల నియామక ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం ఏడు కారిడార్లలో తొలి దశలో నాలుగు కీలక మార్గాలకు జీసీలను ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టారు. మొత్తం రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో 122.9 కిలోమీటర్ల మేర మెట్రో ఫేజ్–2 విస్తరణ పనులు జరగనున్నాయి. ఇందులో భాగంగా రాయదుర్గం–కోకాపేట (11.6 కి.మీ.), ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), ఎల్బీనగర్–హయత్?నగర్ (7.1 కి.మీ.), మియాపూర్–పటాన్‌చెరు (13.4 కి.మీ.) కారిడార్ల పనుల పర్యవేక్షణ కోసం రెండు నెలల క్రితం టెండర్లు పిలిచారు. అయితే, ఆశించిన స్థాయిలో కంపెనీలు ముందుకు రాకపోవడంతో టెండర్ల గడువును ఈ నెల 22 వరకు పొడిగించారు. ఈ నాలుగు కారిడార్లకు జీసీల నియామకం పూర్తయితే పనుల్లో గణనీయమైన పురోగతి సాధించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



**ప్రాజెక్టులో జీసీల పాత్ర కీలకం**

నిర్మాణ పనుల్లో జీసీల పాత్ర అత్యంత కీలకం. ప్రాజెక్టు డిజైన్ల రూపకల్పన, పనుల నాణ్యత పర్యవేక్షణ, కాంట్రాక్టర్లు, ఇతర సంస్థలతో సమన్వయం చేయడం వీరి ప్రధాన బాధ్యత. నిర్మాణ సమయంలో తలెత్తే సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు సూచిస్తూ, ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు హెచ్ఎంఆర్ఎల్‌కు నివేదించాల్సి ఉంటుంది. జీసీల ఎంపికను 'క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్' (క్యూసీబీఎస్) పద్ధతిలో చేపట్టనున్నారు. అంటే, సంస్థల గత పనితీరు, సాంకేతిక సామర్థ్యం, నాణ్యతతో పాటు వారు కోట్ చేసిన వ్యయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా ఎంపిక చేస్తారు.

**ఓల్డ్ సిటీ మెట్రోకు అడ్డంకులు తొలగింపు**

మరోవైపు, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పాతబస్తీ మెట్రో కారిడార్ (ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట) పనుల్లో ప్రధాన అడ్డంకి అయిన భూసేకరణ దాదాపుగా కొలిక్కి వచ్చింది. గతంలో అలైన్‌మెంట్‌లో మార్పుల కారణంగా అవసరమైన ఆస్తుల సంఖ్యను 1,400 నుంచి 888కి తగ్గించారు. ఇప్పటివరకు ఇందులో 833 ఆస్తులను సేకరించగా, మిగిలిన 55 ఆస్తుల సేకరణను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మార్గంలో పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. తొలగించిన ప్రతీ చెట్టుకు బదులుగా వేరే ప్రాంతంలో ఆరు మొక్కలు నాటాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# మరోసారి చెపుతున్నా.. అధికారం జెన్–జీది, నాది బాల్ థాకరే పాత్ర: విజయసాయిరెడ్డి

- కొత్త పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇచ్చిన విజయసాయిరెడ్డి
- దసరా నాటికి పేరు, జెండా, ఎజెండా సిద్ధమవుతాయని ప్రకటన
- రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటే తన లక్ష్యమన్న విజయసాయి
- గత ఎన్నికల తర్వాత వైసీపీకి దూరమైన విజయసాయి

**తొలివెలుగు, అమరావతి:** రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తన రాజకీయ భవిష్యత్‌పై మరో ప్రకటన చేశారు. ఆయన త్వరలోనే పార్టీ పెట్టబోతుండడం తెలిసిందే. అందుకు తగిన సన్నాహాలు జోరుగా సాగుతున్నాయని వెల్లడించారు. రాజకీయాల్లో తనది బాల్ థాకరే (శివసేన వ్యవస్థాపకుడు) వంటి పాత్రేనని, అధికారం యువతరానిదే (జెన్–జీ) అని తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "పార్టీ పేరు, జెండా, ఎజెండా ఈ పవిత్ర దసరా పర్వదినాల్లో సిద్ధం అవుతున్నాయి" అని వెల్లడించారు. తాను పార్టీ పెట్టవద్దని కోరుకునే వారు చేస్తున్న చౌకబారు ప్రచారాలకు విలువివ్వాల్సిన అవసరం లేదని కొట్టిపారేశారు. రాష్ట్రంలోని రెండు కుటుంబ పార్టీలపై తిరుగుబాటుగానే తన పార్టీ ఆవిర్భవిస్తుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో మెరికల్లాంటి కొత్త నాయకత్వాన్ని తయారు చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. "మరోసారి చెపుతున్నా... అధికారం జెన్–జీది, నాది బాల్ థాకరే పాత్ర" అని తన పోస్టులో వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో విజయసాయిరెడ్డి వైసీపీకి దూరమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత పార్టీకి రాజీనామా చేసి, కొంతకాలం వ్యవసాయంపై దృష్టి సారించారు. ఆయన వేరే పార్టీలో చేరతారంటూ ప్రచారం జరిగినా, వాటన్నింటినీ తోసిపుచ్చుతూ సొంతంగా పార్టీ పెట్టడానికే మొగ్గు చూపారు. తాజా పోస్టుతో విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాల్లో తన తదుపరి అడుగులను ఖరారు చేసినట్టయింది.



# మూసీకి కొత్త రూపు.. తొలి దశలో 21 కి.మీ. టెండర్ల ప్రక్రియ ప్రారంభం



**మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు ఏడీబీ నుంచి ఆమోదం**

**రెండు ప్యాకేజీల్లో రూ.7,345 కోట్ల అంచనాతో పనులు**

**టెండర్ల దాఖలుకు నవంబర్ 26 తుది గడువు**

**నది ప్రక్షాళన, సుందరీకరణతో పాటు ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం**

**తొలివెలుగు, హైదరాబాద్:** నగరాన్ని సుందరంగా మార్చే మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి అనుమతులు రావడంతో, తొలి దశ పనులకు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులను రెండు ప్యాకేజీల కింద చేపట్టనున్నారు. ఎంఆర్‌డీసీఎల్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, అక్టోబరు 15 నుంచి టెండర్ పత్రాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. టెండర్లు దాఖలు చేయడానికి నవంబర్ 26ని చివరి తేదీగా నిర్ణయించారు. ఈ నెలాఖరు నాటికి అర్హత కలిగిన సంస్థను ఎంపిక చేసే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మొదటి దశ పనుల కోసం రూ.7,345 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇందులో భాగంగా, జోన్-1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు ఈసా నదిపై 9.8 కి.మీ., జోన్-1బీ కింద గండిపేట నుంచి బాపుఘాట్ వరకు మూసీపై 11.2 కి.మీ. మేర అభివృద్ధి పనులు చేపడతారు. నది ప్రక్షాళన, వరద నివారణకు రిటైనింగ్ గోడల నిర్మాణం, సుందరీకరణ, రోడ్లు, బ్రిడ్జిలు, రబ్బర్ డ్యామ్‌లు నిర్మిస్తారు. ఔటర్ రింగ్ రోడ్‌పై ఒక ఐకానిక్ కేబుల్ స్టేడ్ బ్రిడ్జి నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మొత్తం 55 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4,500 కోట్ల వరకు రుణం అందించనుండగా, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. డిసెంబర్ 2027 నాటికి తొలి దశ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రాజేంద్రనగర్ పరిధిలో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, పరిహారంపై కొందరు స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు వేగవంతం కానున్నాయి.

# న్యూయార్క్‌లో మహమ్మద్ యూనస్‌కు ఘోర అవమానం

**న్యూయార్క్ జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టులో మహమ్మద్ యూనస్‌కు చుక్కెదురు**

**యూనస్‌ను 'టెర్రరిస్ట్' అంటూ నిలదీసిన బంగ్లాదేశ్ ప్రవాసులు**

**ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసి వేలమందిని చంపారని తీవ్ర ఆరోపణలు**

**వీల్‌చైర్‌లో వెళుతున్న యూనస్‌ను చుట్టుముట్టి నిరసనకారుల ఆగ్రహం**



బంగ్లాదేశ్ మాజీ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వైజర్ మహమ్మద్ యూనస్‌కు అమెరికాలో చేదు అనుభవం ఎదురైంది. న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నడీ (జేఎఫ్‌కే) అంతర్జాతీయ విమానాశ్రయంలో కొందరు బంగ్లాదేశ్ ప్రవాసులు ఆయనను అడ్డుకుని, తీవ్ర పదజాలంతో నిరసన వ్యక్తం చేశారు. యూనస్‌ను 'టెర్రరిస్ట్' అని సంబోధిస్తూ, బంగ్లాదేశ్‌లో వేలాది మంది మరణానికి ఆయనే కారణమని, అక్కడ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఘాటుగా ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అక్టోబర్ 12న దోహా నుంచి ఖతార్ ఎయిర్‌వేస్ విమానంలో న్యూయార్క్ చేరుకున్న యూనస్‌ను, టెర్మినల్ 8 వద్దకు రాగానే కొందరు నిరసనకారులు చుట్టుముట్టారు. "నువ్వో ఉగ్రవాదివి, ఇక్కడికి ఎందుకు వచ్చావు? మా దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశావు" అని ఒక నిరసనకారుడు ఆగ్రహం వ్యక్తం చేయడం వీడియోలో వినిపించింది. బంగ్లాదేశ్‌లో వేలాది మంది ప్రాణనష్టానికి ఆయనే బాధ్యుడని మరొకరు ఆరోపించారు. వీల్‌చైర్‌లో సిబ్బంది సహాయంతో విమానాశ్రయం వెలుపలికి వస్తున్న యూనస్‌ను నిరసనకారులు అడుగడుగునా నిలదీశారు. వేలాది మంది బంగ్లాదేశ్ పోలీసుల మరణానికి యూనస్ కారణమని ఆరోపిస్తూ, "గో బ్యాక్" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ ఘటనపై బంగ్లాదేశ్ వార్తాపత్రిక 'డైలీ సన్' కథనాన్ని ప్రచురించింది. 18 నెలల పాటు మధ్యంతర ప్రభుత్వానికి అధిపతిగా ఉన్న సమయంలో యూనస్ పాలనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడ్డారని, ప్రత్యర్థులను అక్రమంగా నిర్బంధించారని, ఆయన హయాంలో మైనారిటీలపై దాడులు పెరిగాయని ఆరోపణలు ఉన్నాయి. న్యాయవాదులు, రాజకీయ నాయకులు, పాత్రికేయులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలను సుదీర్ఘకాలం పాటు జైళ్లలో ఉంచారని విమర్శకులు మండిపడుతున్నారు. యూనస్ పాలన కాలంలో ఎంతమందిని అరెస్టు చేశారు, ఎవరిపై కేసులు నమోదు చేశారనే దానికి సంబంధించి అధికారికంగా ఎలాంటి రికార్డులు లభ్యం కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ సంస్థలను సంస్కరిస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చినప్పటికీ, పాలన మొత్తం ఎన్నిక కాని కొందరు పౌర సమాజ ప్రముఖుల చేతుల్లోకి వెళ్లినట్లు విమర్శలు ఉన్నాయి. వీరిలో చాలామంది విదేశీ పౌరసత్వం కలిగిన వారు కావడంతో, ప్రజాస్వామ్య జవాబుదారీతనం లేని ఒక "కిచెన్ క్యాబినెట్" ద్వారా ప్రభుత్వం నడిచిందని ఆ పత్రిక పేర్కొంది. ఆయన హయాంలో ప్రభుత్వ సంస్థలను రాజకీయమయం చేశారనేది మరో ప్రధాన ఆరోపణ. ఈ రాజకీయ అస్థిరతను అదునుగా చేసుకుని జమాత్-ఇ-ఇస్లామీ, నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్సీపీ) వంటి సంస్థలు బ్యూరోక్రసీలో, ఇతర ప్రభుత్వ విభాగాలలో తమ ప్రభావాన్ని పెంచుకున్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు. ఫలితంగా పాలన వ్యవస్థ మెరుగుపడటానికి బదులుగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెరిగిపోయాయని వారు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే న్యూయార్క్‌లో యూనస్‌కు వ్యతిరేకంగా ప్రవాస బంగ్లాదేశీయులు తమ నిరసనను వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ నీటి సరఫరాపై సీఎస్ సమీక్ష.. కీలక ఆదేశాలు

**తొలివెలుగు,హైదరాబాద్:** ఎల్‌నినో ప్రభావంతో జలాశయాల్లో నీటి మట్టాలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో, హైదరాబాద్ మహానగరానికి నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరానికి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరి నుంచి సుమారు 560 ఎంజీడీల నీరు అందుతోంది. దీనికి అదనంగా మరో 60 ఎంజీడీల నీటిని సమీకరించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా కృష్ణా నది నుంచి 15 ఎంజీడీలు, మిషన్ భగీరథ ద్వారా 40 ఎంజీడీలు, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల నుంచి 5 ఎంజీడీల అదనపు నీటిని తరలించనున్నారు. మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం 5 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా, నవంబర్ నాటికి పైప్‌లైన్



పనులు పూర్తయితే మరో 20 ఎంజీడీల నీరు లభించనుందని అధికారులు వెల్లడించారు. గత రెండు మూడు నెలలుగా భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని అధికారులు సీఎస్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లలోని మురుగునీటి శుద్ధి ప్లాంట్లను పూర్తి సామర్థ్యంతో నిర్వహించాలని సీఎస్ సూచించారు. శుద్ధి చేసిన నీటిని తోటపని, వాహనాల శుభ్రత వంటి ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి 'గ్రీన్ ట్యాంకర్ల' ద్వారా ప్రత్యేకంగా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. తాగునీటిని ఇతర అవసరాలకు వృథా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. మంజీరా, సింగూర్ జలాశయాలపై ఆధారపడిన మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. నీటి పొదుపుపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సినీ ప్రముఖులతో కలిసి 60 రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంజయ్ జాజు తెలిపారు. ప్రతి నీటి చుక్కనూ అమూల్యమైనదిగా భావించి, నీటి పొదుపులో ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.



# కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ.. బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడుతున్నారు: సబితా ఇంద్రారెడ్డి

**కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్ర విమర్శలు**

**బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఖరారు కాకుండానే భూసేకరణ చట్టవిరుద్ధమని ఆరోపణ**

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని ధ్వజం**

**తొలివెలుగు, హైదరాబాద్:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని... కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

# ఏజెన్సీలోని కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి: కవిత డిమాండ్

**ప్రభుత్వం జారీ చేసిన 2026 పోలీస్ నోటిఫికేషన్‌పై కవిత అభ్యంతరం**

**ఈ నిర్ణయంతో గిరిజన యువత 400లకు పైగా పోస్టులు కోల్పోతారని ఆరోపణ**

**సీఎం రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

**తొలివెలుగు, హైదరాబాద్:** తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ పోస్టుల్లో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో జారీ చేసిన జీవో 109, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవిత పేర్కొన్నారు. అయితే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన 2026 పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీ, గిరిజన యువత కానిస్టేబుల్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన యువతకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ, 2026 నోటిఫికేషన్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని గిరిజన యువత 400కు పైగా కానిస్టేబుల్ పోస్టులను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. హోంమంత్రిత్వ శాఖను కూడా పర్యవేక్షిస్తున్న రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, 2026 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో అవసరమైన సవరణలు చేసి ఆదివాసీ, గిరిజన యువతకు పూర్తి న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# శ్రీశైలం ప్రాజెక్టుకు అంతర్జాతీయ ఖ్యాతి

**వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు చోటు**

**ఇది తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్న గొట్టిపాటి రవి**

**భారీ వరదలను తట్టుకున్న నిర్మాణ పటిష్ఠతకు దక్కిన గౌరవమని వ్యాఖ్య**

**తొలివెలుగు, అమరావతి:** శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రతిష్ఠాత్మకమైన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం లభించడం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈ అరుదైన గుర్తింపుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శ్రీశైలం కేవలం విద్యుదుత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మందికి తాగునీరు, రైతులకు సాగునీరు అందిస్తున్న బహుళార్థసాధక ప్రాజెక్ట్ అని కొనియాడారు. గతంలో భారీ వరదలను తట్టుకుని నిలబడిన శ్రీశైలం డ్యామ్ నిర్మాణ పటిష్ఠతకు ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు రావడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు ఇంజనీరింగ్ నైపుణ్యం, విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం, బహుముఖ ప్రయోజనాలకు ఈ పురస్కారం నిదర్శనమని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టిని మంత్రి ప్రశంసించారు. పట్టిసీమ పథకాన్ని అందుబాటులోకి తీసుకురావడం వల్లే శ్రీశైలం నీటిని రాయలసీమకు సమర్థంగా వినియోగించుకోగలుగుతున్నామని తెలిపారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీటిని సరఫరా చేయడంతో, శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు వాడుకునేందుకు పూర్తి వెసులుబాటు కలిగిందని గొట్టిపాటి గుర్తుచేశారు. శ్రీశైలం జలాశయం ఇప్పటికీ రాయలసీమతో పాటు కృష్ణా డెల్టా రైతుల అవసరాలను తీరుస్తూ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు.





## విశాఖపట్నం మేయర్ టికెట్ రేసు.. తెరపైకి బాలయ్య చిన్నకుమార్తె తేజస్విని పేరు!

**విశాఖ మేయర్ పీఠం జనరల్ మహిళకు రిజర్వ్**
**ప్రధాన పార్టీలలో మొదలైన అభ్యర్థుల వేట**
**టీడీపీ నుంచి తేజస్విని, లావణ్య పేర్ల ప్రచారం**
**వైసీపీలో బొత్స ఝాన్సీ, హిమగౌరి పేర్లు పరిశీలన**
**వైజాగ్‌కు మూడో మహిళా మేయర్ రాక ఖాయం**

'గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్' (జీవీఎంసీ) ఎన్నికల సందడి మొదలైంది. మేయర్ పీఠానికి రిజర్వేషన్ ఖరారు కావడంతో, నగరం రాజకీయంగా వేడెక్కింది. ఈసారి విశాఖ మేయర్ పదవిని 'జనరల్ మహిళ'కు కేటాయించడంతో, ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైఎస్సార్‌సీపీలు తమ అభ్యర్థుల ఎంపికపై తీవ్రంగా దృష్టి సారించాయి. సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుంటూ, గెలుపు గుర్రాలను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో పలువురి పేర్లు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. టీడీపీ నుంచి నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె, విశాఖ ఎంపీ శ్రీభరత్ అర్ధాంగి తేజస్విని పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అదేవిధంగా ఏపీ టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అర్ధాంగి లావణ్య పేరు కూడా తెరపైకి వచ్చింది. వీరితో పాటు మాజీ కార్పొరేటర్ ముక్కా శ్రావణి, మరో ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇవన్నీ ప్రస్తుతానికి ఊహాగానాలే అయినా, అధిష్ఠానం త్వరలోనే బలమైన అభ్యర్థిని ఖరారు చేసేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు వైసీపీలో కూడా మేయర్ అభ్యర్థిత్వం కోసం గట్టి పోటీ నెలకొంది. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అర్ధాంగి, మాజీ ఎంపీ అయిన బొత్స ఝాన్సీ పేరు బలంగా వినిపిస్తోంది. ఆమెకు రాజకీయంగా మంచి అనుభవం ఉండటం కలిసొచ్చే అంశం. అలాగే, మరో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అర్ధాంగి హిమగౌరి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, అనకాపల్లి మాజీ ఎంపీ బీశెట్టి సత్యవతి పేర్లు కూడా రేసులో ఉన్నాయి. వైసీపీ అధిష్ఠానం సైతం సామాజిక వర్గాల వారీగా అభ్యర్థి ఎంపికపై లెక్కలు వేస్తోంది. గ్రేటర్ విశాఖ చరిత్రలో ఇప్పటివరకు ఇద్దరు మహిళలు మేయర్లుగా బాధ్యతలు నిర్వర్తించారు. జీవీఎంసీ ఏర్పడక ముందు కాంగ్రెస్ పార్టీ తరఫున రాజాన రమణి (2000-2005), ఆ తర్వాత 2021 నుంచి వైసీపీ తరఫున గొలగాని హరి వెంకట కుమారి మేయర్‌గా పనిచేశారు. తాజా రిజర్వేషన్‌తో విశాఖకు మూడో మహిళా మేయర్ రానున్నారు. ప్రధాన పార్టీలు ప్రముఖుల కుటుంబ సభ్యుల పేర్లను పరిశీలిస్తుండటంతో ఈసారి మేయర్ ఎన్నికలు అత్యంత రసవత్తరంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## అల్పాహార పథకం సూపర్ హిట్.. బడుల్లో 22 శాతం పెరిగిన హాజరు!

**తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకంపై సర్వేలో సత్ఫలితాలు**
**పాఠశాలల్లో 20 నుంచి 22 శాతం వరకు పెరిగిన విద్యార్థుల హాజరు**
**సర్వేలో 99.9 శాతం మంది విద్యార్థులు టిఫిన్ తింటున్నారని వెల్లడి**
**మెనూలో బోండా, దోశకు అధిక ఆదరణ.. ఉప్మాకు తక్కువ స్పందన**
**రాష్ట్రవ్యాప్తంగా పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం**

ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రికగా ప్రారంభమైన అల్పాహార పథకం అద్భుతమైన ఫలితాలనిస్తోంది. ఈ పథకం వల్ల విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరగడమే కాకుండా, వారిలో ఆరోగ్యపరమైన మార్పులు కూడా కనిపిస్తున్నాయని ఓ స్వతంత్ర సర్వే స్పష్టం చేసింది. కొడంగల్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ పథకంపై 'థర్డ్ విజన్ రీసెర్చ్ అండ్ సర్వీసెస్' సంస్థ ఈ సర్వేను నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు హరే కృష్ణ మూమెంట్ (హెచ్‌కేఎం) చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొడంగల్‌లోని సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఈ పథకం అమలవుతోంది. కొడంగల్‌తో పాటు కోస్గీ, బొంరాసిపేట, దోమ, తాండూరు సహా పది మండలాల్లోని పాఠశాలల్లో 1,153 మంది విద్యార్థులు, 575 మంది తల్లిదండ్రులు, 176 మంది ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించి ఈ నివేదికను రూపొందించారు.

### సర్వేలో తేలింది ఇదే..

నివేదిక ప్రకారం, ఈ పథకం ప్రారంభమయ్యాక 60 పాఠశాలల్లో ఏకంగా 1,525 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. పాఠశాలల్లో అందిస్తున్న అల్పాహారాన్ని 99.9 శాతం విద్యార్థులు తింటుండగా, ఆకలితో అలమటించే వారి సంఖ్య 98.3 శాతం మేర తగ్గినట్లు తేలింది. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే హాజరు శాతం సగటున 20 నుంచి 22 శాతం పెరిగింది. ఉపాధ్యాయులు సైతం పథకం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. 97.7 శాతం మంది సమయానికి అల్పాహారం అందుతోందని తెలిపారు.

### రుచి, నాణ్యతపై సానుకూల స్పందన

విద్యార్థుల్లో 92.7 శాతం మంది నాణ్యత బాగుందని చెప్పగా, 91.3 శాతం మంది రుచి బాగుందని కితాబిచ్చారు. మెనూలో బోండా-చట్నీ, దోశ-చట్నీలకు 95 శాతం పైగా విద్యార్థులు ఓటేశారు. అయితే, ఉప్మా-చట్నీకి కేవలం 75 శాతం మాత్రమే సానుకూల స్పందన లభించింది. మెనూలో వడను కూడా చేర్చాలని 29.2 శాతం మంది విద్యార్థులు కోరారు. నాణ్యతను మరింత మెరుగుపరచాలని కొందరు ఉపాధ్యాయులు సూచించారు. కొడంగల్‌లో విజయవంతమైన ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డిసెంబరు 9న అన్ని కిచెన్‌లను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఉదయం పూట ఆకలితో తరగతులకు వచ్చే అవస్థను తప్పించి, చదువుపై ఏకాగ్రత పెంచే ఈ పథకం విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## అమెరికాలో విద్యుత్ సంక్షోభం? 13 రాష్ట్రాలకు బ్లాక్‌అవుట్ ముప్పు.. రంగంలోకి ప్రభుత్వం!

- అమెరికాలోని 13 రాష్ట్రాలు, వాషింగ్టన్ డీసీలో విద్యుత్ కోతల నివారణకు చర్యలు
- 6.5 కోట్ల మంది ప్రజలకు సేవలందించే పీజేఎం గ్రిడ్‌కు ప్రత్యేక అధికారాలు
- అనూహ్యంగా పెరిగిన ఉష్ణోగ్రతలు, నిర్వహణ పనులతో విద్యుత్ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి
- అవసరమైతే బ్యాకప్ జనరేటర్లు వాడాలని ఇంధన శాఖ ఆదేశాలు
- ఇవి ముందు జాగ్రత్త చర్యలేనని, ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారుల స్పష్టీకరణ



అమెరికాలో తీవ్ర విద్యుత్ సంక్షోభం ముంచుకొస్తోంది. దేశంలోనే అతిపెద్ద విద్యుత్ గ్రిడ్ ఆపరేటర్ అయిన పీజేఎం పరిధిలోని 13 రాష్ట్రాలు, వాషింగ్టన్ డీసీలో బ్లాక్‌అవుట్‌లు సంభవించే ప్రమాదం ఏర్పడింది. దీంతో అమెరికా ఇంధన శాఖ వెంటనే రంగంలోకి దిగి, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా చూసేందుకు అత్యవసర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల ద్వారా సుమారు 6.5 కోట్ల మంది ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది.

### అసలేం జరిగింది?

శరదృతువులో అనూహ్యంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం, దీంతో విద్యుత్‌కు డిమాండ్ భారీగా పెరగడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. అదే సమయంలో, శీతాకాలానికి సన్నద్ధమయ్యే క్రమంలో అనేక విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ప్రణాళికాబద్ధమైన నిర్వహణ (మెయింటెనెన్స్) పనుల కోసం మూతపడ్డాయి. దీనికి తోడు, ట్రాన్స్‌మిషన్ లైన్లలో కూడా మరమ్మతులు జరుగుతుండటంతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి విద్యుత్ బదిలీపై పరిమితులు ఏర్పడ్డాయి. ఈ కారణాల వల్ల విద్యుత్ వ్యవస్థ రిజర్వ్ మార్జిన్‌కు దగ్గరగా పనిచేస్తుండటంతో గ్రిడ్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అక్టోబర్ 13 నాటికి విద్యుత్ డిమాండ్ సుమారు 1,11,500 మెగావాట్లకు చేరుకుంటుందని పీజేఎం అంచనా వేసింది. ముఖ్యంగా మేరీల్యాండ్, వర్జీనియా, నార్త్ కరోలినా, వాషింగ్టన్ మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుందని భావించింది. దీంతో అప్రమత్తమైన పీజేఎం, గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడేందుకు అదనపు అధికారాలు కావాలని అక్టోబర్ 11న ఇంధన శాఖను అభ్యర్థించింది.

### ప్రభుత్వం తీసుకున్న చర్యలు

పీజేఎం అభ్యర్థన మేరకు, అమెరికా ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్ ఫెడరల్ పవర్ యాక్ట్‌లోని సెక్షన్ 202(సి) కింద అక్టోబర్ 12న అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 13 నుంచి 16 వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం, గ్రిడ్ స్థిరత్వం కోసం అవసరమైన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను వెంటనే ఆపరేట్ చేసే అధికారం పీజేఎంకు లభించింది. ఒకవేళ పరిస్థితి మరింత దిగజారితే, చివరి ప్రయత్నంగా డేటా సెంటర్లు, భారీ వాణిజ్య, పారిశ్రామిక సముదాయాల వద్ద ఉన్న బ్యాకప్ జనరేటర్లు, స్టాండ్‌బై యూనిట్లు, బ్యాటరీ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయ వనరులను కూడా వాడుకోవడానికి అనుమతి ఇచ్చారు. ఇవి కేవలం ముందు జాగ్రత్త చర్యలేనని, నిర్బంధ విద్యుత్ కోతలను (లోడ్ షెడ్డింగ్) నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఆదేశాలతో మధ్య అట్లాంటిక్ ప్రాంతంలోని లక్షలాది కుటుంబాలు, వ్యాపారాలకు నమ్మకమైన, సురక్షితమైన విద్యుత్‌ను అందించగలమని ఇంధన శాఖ కార్యదర్శి క్రిస్ రైట్ తెలిపారు. ప్రజలు ప్రస్తుతానికి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వినియోగంపై ఎటువంటి ఆంక్షలు విధించడం లేదని పీజేఎం ప్రతినిధి ఒకరు తెలిపారు.

## కేంద్రంపై ఉమ్మడి పోరాటం.. మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

**ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం తమ పోరాటం ఆగదని స్పష్టం చేసిన విపక్షాలు**
**నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదా రద్దును తీవ్రంగా ఖండన**
**ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**
**రాహుల్ గాంధీ నాయకత్వంలో ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించిన కూటమి నేతలు**



**సువర్ణ జ్యోతి,ఢిల్లీ:** ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్షాలు మంగళవారం స్పష్టం చేశాయి. న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించినా, పోషించకపోయినా తమ ప్రతిఘటన ఆగదని తేల్చిచెప్పాయి. నిరసనల వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) సహా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు కీలక నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల అనంతరం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు రాహుల్ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మాకు సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. వారు తమ బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాం. ఏ వ్యవస్థ స్పందించినా, స్పందించకపోయినా మా రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది, అంతిమంగా విజయం సాధిస్తుంది" అని అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి అంత సులభంగా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఓట్ల దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. "ఈ కుట్రకు ప్రధాన రూపశిల్పి మోదీ కాగా, అమలు చేసిన వ్యక్తులు అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ అని, వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వారు గ్రహించాలి. వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని హామీ ఇస్తున్నాం" అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### జంతర్ మంతర్‌పై పోరాటం

నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదాను ప్రభుత్వం రద్దు చేయడాన్ని పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వంలోని భయం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. జంతర్ మంతర్‌ను తిరిగి దక్కించుకోవడానికి పోరాడతామని సీపీఐ నేత డి. రాజా ప్రకటించారు. రాబోయే రోజుల్లో 'ఇండియా' కూటమి చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసే ప్రయత్నం ఉంటుందని కూటమి వర్గాలు తెలిపాయి. సీపీఎం పొలిట్‌బ్యూరో సైతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. శాంతియుత నిరసన హక్కును బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర నేతలు సైతం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రమాదంలో పడటంతోనే ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమయ్యాయని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. 'ఓట్ల దొంగతనం'లో పాలుపంచుకున్న జ్ఞానేశ్ కుమార్, ఇతర అధికారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని తృణమూల్ నేత సాగరిక ఘోష్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఈసీని పదవి నుంచి తప్పించే వరకు ఉద్యమం కొనసాగుతుందని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు.

## ల్లీలో గౌతమ్ అదానీ, మైక్ బ్లూమ్‌బెర్గ్ భేటీ.. కీలక అంశాలపై చర్చ!

**ఇంధన మార్పు, ఏఐ, మౌలిక సదుపాయాలపై చర్చ**
**బ్లూమ్‌బెర్గ్ దార్శనికతను ప్రశంసించిన గౌతమ్ అదానీ**
**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ పాత్ర పెరుగుతోందన్న బ్లూమ్‌బెర్గ్**
**బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్ వేదికగా ఈ సమావేశం**



అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ప్రముఖ వ్యాపారవేత్త, బ్లూమ్‌బెర్గ్ సహ వ్యవస్థాపకుడు మైక్ బ్లూమ్‌బెర్గ్‌తో సమావేశమయ్యారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్' వేదికగా నిన్న వీరి భేటీ జరిగింది. ప్రపంచ ఇంధన మార్పు ప్రక్రియను వేగవంతం చేయడం, పట్టణ మౌలిక సదుపాయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) భవిష్యత్తు, సుస్థిర వృద్ధి వంటి కీలక అంశాలపై వీరిద్దరూ చర్చించుకున్నారు. ఈ సమావేశంపై గౌతమ్ అదానీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "మైక్ బ్లూమ్‌బెర్గ్‌ను కలవడం సంతోషంగా ఉంది. ప్రపంచ ఇంధన మార్పు, మౌలిక సదుపాయాలు, ఏఐ, సుస్థిర వృద్ధి వంటి అంశాలపై ఫలవంతమైన చర్చ జరిగింది. వాతావరణ మార్పులపై పోరాటంలో మైక్ బ్లూమ్‌బెర్గ్ దార్శనికత, నిబద్ధత ఎంతో స్ఫూర్తినిస్తాయి" అని అదానీ తన పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, మైక్ బ్లూమ్‌బెర్గ్ కూడా ఈ భేటీపై స్పందించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో, ఆవిష్కరణలలో భారత్ పాత్ర వేగంగా పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ భవిష్యత్ అవకాశాలపై ఇక్కడి ప్రముఖ వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలతో మాట్లాడే అవకాశం లభించిందని ఆయన తెలిపారు. న్యూఢిల్లీ వేదికగా అక్టోబర్ 13 నుంచి 15 వరకు బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్ ఎనిమిదో ఎడిషన్ జరుగుతోంది. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడం, కొత్త అవకాశాలను అన్వేషించడం లక్ష్యంగా ఈ సదస్సులో వివిధ దేశాల వ్యాపార, ప్రభుత్వ రంగాల ప్రముఖులు పాల్గొంటున్నారు.



## గంగానదిలో బోటు మునక.. 8 మంది చిన్నారులు సహా 11 మంది మృతి

**బిహార్‌లోని వైశాలి జిల్లాలో ఘటన**

**విందు కోసం వెళ్తుండగా విషాదం**

**మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా**

బిహార్‌లోని వైశాలి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. గంగా నదిలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక పడవ బోల్తా పడటంతో 8 మంది చిన్నారులు సహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు. రాఘోపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌పూర్ శ్యామ్‌చంద్ గ్రామ సమీపంలో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. బాధితులంతా ఒక విందు కార్యక్రమానికి హాజరయ్యేందుకు పడవలో ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ప్రమాద సమయంలో పడవలో సుమారు 15 నుంచి 20 మంది వరకు ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అధికార యంత్రాంగం సహాయక చర్యలు ప్రారంభించాయి. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంలో పలువురిని కాపాడి, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులే ఉన్నారని వైశాలి జిల్లా మేజిస్ట్రేట్ వర్షా సింగ్ తెలిపారు. ఈ దురదృష్టకర ఘటనపై ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరి, ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది చాలా బాధాకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## మోదీ కేబినెట్‌కు ఎల్. మురుగన్ రాజీనామా..

కేంద్ర ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ తన పదవులకు రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి పదవితో పాటు, తన రాజ్యసభ సభ్యత్వానికి కూడా ఆయన మంగళవారం రాజీనామా సమర్పించారు. తమిళనాడులో బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి పార్టీని సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు మురుగన్ వెల్లడించారు. “తమిళనాడుకు వెళ్లి పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేయాలన్న నా ఆకాంక్షను ప్రధాని మోదీకి లేఖ ద్వారా తెలియజేశాను. మంత్రిగా నా బాధ్యతల నుంచి, రాజ్యసభ సభ్యత్వం నుంచి నన్ను విముక్తుడిని చేయాలని కోరాను” అని ఆయన వివరించారు. ఇటీవల ప్రధాని మోదీ తమిళనాడు పర్యటనకు వచ్చినప్పుడు ప్రజల నుంచి లభించిన అపూర్వ ఆదరణ, ఉత్సాహం చూశాక తన నిర్ణయం మరింత బలపడిందని ఆయన పేర్కొన్నారు. తమిళనాడులోని ప్రతి గ్రామం, ప్రతి వీధిలో పర్యటించి ప్రజలను, పార్టీ కార్యకర్తలను కలుస్తానని, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఉనికిని విస్తరింపజేస్తానని మురుగన్ తన లేఖలో పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు నుంచి పార్టీకి మెరుగైన ఫలితాలు అందించడమే తన లక్ష్యమని ఆయన తెలిపారు. త్వరలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చనే ఊహాగానాల మధ్య మురుగన్ రాజీనామా రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

**సాధారణ కార్యకర్తకు దక్కిన గౌరవం**

ఈ సందర్భంగా గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీకి మురుగన్ కృతజ్ఞతలు తెలిపారు. తనది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కాదని, తమిళనాడులోని ఓ కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించానని గుర్తు చేసుకున్నారు. తన తల్లిదండ్రులు రోజువారీ కూలీలుగా, పశువుల కాపరులుగా పనిచేశారని, అలాంటిది వారి కుమారుడిగా తాను కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తానని ఎన్నడూ ఊహించలేదని అన్నారు. కళాశాల రోజుల్లోనే ఏబీవీపీలో చేరి, గత మూడు దశాబ్దాలుగా ఏబీవీపీ, బీజేపీల్లో నిబద్ధతతో పనిచేశానని తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ వైస్-ఛైర్మన్‌గా, రాజ్యసభ సభ్యుడిగా తనకు దక్కిన అవకాశాలను ఆయన స్మరించుకున్నారు. 2021 జులైలో ఆయన కేంద్ర మంత్రిమండలిలో చేరారు. కాశీ తమిళ్ సంగమం, పార్లమెంటులో సెంగోల్ ఏర్పాటు వంటి కార్యక్రమాలతో తమిళ వారసత్వానికి కేంద్ర ప్రభుత్వం గొప్ప గుర్తింపునిచ్చిందని కొనియాడారు. ‘సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్’ అనే సందేశాన్ని తమిళనాడు ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని మరింత పటిష్ఠం చేస్తానని మురుగన్ ధీమా వ్యక్తం చేశారు.



# అలసత్వంపై ‘సుప్రీం’ కొరడా



నలుగురు గుమిగూడి నిరసనకు దిగితే అతిగా స్పందించటం అలవాటైన ఢిల్లీ పోలీసులకు ఇటీవల అక్కడ వరసగా చోటుచేసుకున్న లైంగిక నేరాల గురించి పట్టింపు లేనట్టు కనబడుతోంది. మొన్న ఆగస్టులో గ్రేటర్ నోయిడా నుంచి కశ్మీరీ గేటువరకూ 47 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన బస్సులో ఒక మైనర్ బాలికపై దుండగులు అత్యాచారానికి ఒడిగట్టారు. వారంరోజుల క్రితం ఆగ్నేయ ఢిల్లీలోని ఆస్తా కుంజ్ పార్క్ దగ్గర మరో మైనర్ బాలికపై ముగ్గురు లైంగిక నేరానికి పాల్పడి హత్యచేశారు. దానికి సమీపంలోని లేడీ శ్రీరాం కాలేజీ విద్యార్థినులైతే తమకు లైంగిక వేధింపులు నిత్యకృత్యమయ్యాయనీ, ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదనీ చెబుతున్నారు. ఢిల్లీ--ఎన్‌సీఆర్ పరిధిలో ఈనెల మొదటివారం మొదలుకొని ఇప్పటివరకూ డజను వరకూ లైంగిక నేరాలు వెలుగులోకొచ్చాయని మీడియా కథనాలు చెబుతున్నాయి. అందుకే సోమవారం సర్వోన్నత న్యాయస్థానం పోలీసులపైనా, అధికార యంత్రాంగంపైనా ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇవన్నీ 2012 నాటి నిర్భయ ఉదంతాన్ని గుర్తుకు తెస్తున్నాయని వ్యాఖ్యానించటంతోపాటు శాంతిభద్రతల్ని మెరుగుపరచడానికి నాలుగు సూచనలు చేసింది. వీటిని వచ్చేనెల 5 లోగా అమల్లోకి తీసుకురావాలని ఆదేశించింది. డీఎస్‌పీ ర్యాంకుకు తక్కువకాని అధికారులతో జిల్లాలవారీగా ఎక్కడెక్కడ ప్రమాదకర ప్రాంతాలున్నాయో గుర్తించాలన్నది అందులో మొదటి సూచన. అక్కడి పార్కులు, విద్యాసంస్థలు, శివారు ప్రాంతాలు వగైరాలను ఇందుకోసం కూలంకషంగా పరిశీలించాలని తెలిపింది. అలాగే ఇలాంటి ప్రాంతాల్లో రోజంతా గస్తీ ఉండేలా చూడాలని కోరింది. నిఘా కెమెరాల పనితీరు ఎలావుందో తరచు తనిఖీలుచేసి, అవసరమైన మరమ్మత్తులు చేయించాలని, చీకటి ప్రాంతాలు ఎక్కడా ఉండటానికి వీల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. వాహనాల కిటికీలకు నల్లటి తెరలు, ఫిల్ములు లేకుండా చూడాలని ఆదేశించింది. నిజానికి వీటిల్లో కొన్ని నిర్భయ ఉదంతం తర్వాత ఏర్పాటైన జస్టిస్ జేఎస్ వర్మ కమిషన్ సిఫార్సుల్లో కూడా ఉన్నాయి. 2012లో నిర్భయ ఉదంతం తర్వాత దేశ వ్యాప్తంగా పెల్లుబికిన నిరసనలతో యూపీఏ ఆధ్వర్యంలోని కేంద్రం వెంటనే స్పందించి ఈ కమిషన్ ఏర్పాటుచేసింది. అది నివేదిక ఇవ్వడానికిముందే ఉరిశిక్షతోసహా కఠిన శిక్షలకు ఆస్కారం కల్పించే నిర్భయ ఆర్డినెన్స్ కూడా తెచ్చింది. అప్పట్లోనే ఆ ఆర్డినెన్స్ పైనా, దాని స్థానంలో వచ్చిన చట్టంపైనా మానవహక్కుల సంఘాలు, మహిళా సంఘాలూ పెదవి విరిచాయి. కేవలం కఠిన శిక్షలు నిర్దేశించినంత మాత్రాన నేరాలు ఆగబోవనీ, వెంటవెంటనే స్పందించే యంత్రాంగం, పకడ్బందీ దర్యాప్తు, న్యాయ స్థానాల్లో వేగంగా విచారణ, శిక్షలు ఉంటేనే నేరం చేయాలంటే భయపడే పరిస్థితులుంటాయనీ ఆ సంఘాలు తెలిపాయి. ఇటీవల ఐపీసీ బదులుగా తీసుకొచ్చిన భారతీయ న్యాయసంహితలో అత్యాచార నేరానికి విధించే శిక్షను ఏడేళ్లనుంచి పదేళ్లకు పెంచారు కూడా. దాదాపు పదిహేనేళ్లు గడిచాక చూస్తే పరిస్థితి మొదటికొచ్చింది. కళాశాల విద్యార్థినులు ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులకు తీరిక లేకపోయింది. కనీసం ఆ ప్రాంతంలో గస్తీ పెంచాలన్న ఆలోచన కూడా రాలేదు. దాని పర్యవసానంగానే బాలిక బలైపోయింది. మహిళలపై సమాజంలో శతాబ్దాలుగా పేరుకుపోయిన భావనలు, జెండర్ వివక్ష, బాధ్యతాయుత స్థానాల్లో ఉండేవారి వ్యవహారశైలి, ప్రభుత్వాల అలసత్వమూ ఇలాంటి నేరాలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాయని జస్టిస్ జేఎస్ వర్మ కమిషన్ చేసిన వ్యాఖ్య గమనించదగ్గది. ఉదంతం జరిగినప్పుడల్లా బాధితుల్నే తప్పుబట్టే సంస్కృతి దేశంలో ఇంకా పోలేదు. వాస్తవానికి నిర్భయ ఉదంతం తర్వాత వెనువెంటనే చర్యలుంటాయన్న భరోసాతో ఫిర్యాదులు చేసేవారి సంఖ్య పెరిగింది. కానీ ఎప్పట్లానే అలసత్వమూ, ఫిర్యాదు ఇచ్చినవారినే తప్పుబట్టే ధోరణి గమనించాక చాలామంది వెనక్కి తగ్గటం మొదలైంది. అసలు నమోదైన కేసుల దర్యాప్తులో పోలీసులు నిరాసక్తత సమస్యను మరింత పెంచుతోంది. నిరుడు వెలువడిన గణాంకాల ప్రకారం ఢిల్లీ పరిధిలో రోజుకు అయిదు అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. పరిస్థితి మరింత జటిలం కాకముందే పోలీసులు మేల్కొనాలి. సుప్రీంకోర్టు సూచనలను తక్షణమే అమల్లోకి తీసుకురావాలి.

# కుక్కకాటుకు తగిన చెప్పుదెబ్బ



రేబీస్... నేటికీ నిర్దిష్టమైన చికిత్స విధానం లేని అత్యంత ప్రాణాంతకమైన జూనోటిక్ వ్యాధి. (జంతువుల నుంచి మనుషులకు, అలాగే మనుషుల నుండి జంతువులకు సంక్రమించే వ్యాధులను జూనోటిక్స్ అంటారు). లూయీ పాశ్చర్ 1885లో తొలిసారిగా రేబీస్ నిరోధక టీకాను అభివృద్ధి చేశారు. ఆయన అందించిన ఈ ఆవిష్కరణే నేటికీ మానవాళికి రేబీస్ బారినుంచి రక్షణ కల్పించే ఏకైక ఆయుధంగా ఉపయోగపడుతోంది. లూయీ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28న ‘ప్రపంచ రేబీస్ దినోత్సవం’ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ‘కలిసికట్టుగా... మరింత బలంగా’ అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా దాదాపు 59 వేల మంది రేబీస్‌తో మరణి స్తున్నారు. ఇందులో 95 శాతానికి పైగా మరణాలు ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే సంభవిస్తున్నాయి. భారత దేశంలో ఏటా సుమారు 5,700 మంది మరణిస్తున్నారని జాతీయ అధ్యయ నాలు స్పష్టం చేస్తున్నాయి. బాధితుల్లో ఎక్కువ శాతం 15 ఏళ్లలోపు పిల్లలే ఉండటం విచారకరం. ఈ నేపథ్యంలో 2030 నాటికి కుక్కల కాటు వల్ల సంభ వించే రేబీస్ మరణాలను పూర్తిగా నిర్మూలించాలనేది ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ జంతు ఆరోగ్య సంస్థలు నిర్దేశించుకున్న ‘జీరో బై 30’ ప్రధాన లక్ష్యం.

**ఏడాది తర్వాతా బయటపడొచ్చు!**

రేబీస్ అనేది ‘లైసావైరస్’ అనే వైరస్ ద్వారా వ్యాప్తి చెంది కేంద్ర నాడీ వ్యవస్థపై దాడి చేసే తీవ్రమైన వ్యాధి. మానవుల్లో నమోదయ్యే రేబీస్ కేసుల్లో దాదాపు 99 శాతం కుక కాటు ద్వారానే వస్తున్నాయి. వ్యాధిగ్రస్థ కుక్కలతో పాటు పిల్లులు, నక్కలు, తోడేళ్లు, గబ్బిలాలు వంటి జంతువుల లాలాజలం ద్వారా కూడా ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. రేబీస్ సంక్రమించినప్పుడు జంతువు విపరీతమైన కోపంతో కనిపిస్తుంది. కనపడిన ప్రతి వస్తువును చివరికి చెక్కముక్కలు, రాళ్లను కూడా కొరుకుతుంది. నోటి నుంచి విపరీతంగా లాలాజలం (సొల్లు) కారుస్తుంది. మొరిగే స్వరం మారుతుంది. తన యజమానిని కూడా గుర్తించ లేని స్థితిలో దాడి చేయడానికి ప్రయత్నిస్తుంది. కొన్ని సంద ర్భాలలో వ్యాధిగ్రస్థ కుక్క లేదా జంతువు నిశ్శబ్దంగా ఉండి, అంటు డొక్కలు పడి, వెలుతురును కూడా చూడలేని స్థితిలో ఆహారం, నీరు తీసుకోకుండా ఏదైనా ఒక చీకటి లేదా మరుగు ప్రదేశంలో ఉండి దాదాపు వారంలో చనిపోతుంది. దీనినే ‘డంబ్ రేబీస్’ అంటారు. అలాగే మనుషులు పిచ్చికుక్క కాటుకు గురైన తర్వాత 2--3 నెలల నుండి ఏడాది లోపు ఎప్పుడైనా రేబీస్ లక్షణాలు కనపడవచ్చు. కొన్ని అరుదైన సందర్భాల్లో సంవత్సరం తర్వాత కూడా ఈ వ్యాధి సంక్ర మిస్తుంది. మనుషులు వ్యాధిగ్రస్థులు అయినపుడు కుక్క కాటు పడిన చోట దురద, మంట, జ్వరం మొదలవుతాయి. వ్యాధి ముదిరిన తర్వాత నీటిని చూస్తే గొంతు కండరాలు బిగుసుకుపోయి భయ పడటం (హైడ్రోఫోబియా), గాలి తగిలినా వణికిపోవడం (ఏరో ఫోబియా), తీవ్రమైన ఆందోళన వంటి నాడీ సంబంధిత సమస్యలు కనిపిస్తాయి. మనిషి గొంతుక మారిపోయి కుక్క వలె అరుస్తూ దాడి చేసేందుకు ప్రయత్నిస్తారు. చివరకు కోమాలోకి వెళ్ళి మరణిస్తారు. జంతువు కరిచిన వెంటనే గాయాన్ని ధారాళమైన నీటిధార (రన్నింగ్ వాటర్) కింద సబ్బుతో కనీసం 10 నుండి 15 నిమిషాల పాటు రుద్ది కడగాలి. సబ్బులోని క్షారగుణం వైరస్ పైపొరను నాశనం చేసి, వైరస్ తీవ్రతను దాదాపు 70--80 శాతం అక్కడే తుడిచి పెట్టేస్తుంది. అలాగే గాయంపై కారం, పసుపు, సున్నం, కాఫీ పొడి, ఆకుల పసర్లు వంటివి ఉపయోగించి తమకు తోచిన నాటువైద్యం చేయకూడదు. గాయంపై గట్టిగా కట్టుకట్టడం గానీ, వైద్యుడి సలహా లేకుండా వెంటనే కుట్లు వేయడం గానీ చేయరాదు. ప్రథమ చికిత్స అనంతరం పోవిడోన్ అయోడిన్ వంటి యాంటీ సెప్టిక్ ద్రావణాన్ని పూసి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి వెళ్లి టీకాలు వేయించుకోవాలి. ఇంట్రామస్కులర్ పద్ధతిలో 0, 3, 7, 14, 28వ రోజుల్లో మొత్తం ఐదు డోసులు ఇస్తారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందు బాటులో ఉన్న ఇంట్రాడెర్మల్ పద్ధతిలో 0, 3, 7, 28వ రోజుల్లో... మొత్తం నాలుగు మోతాదులుగా టీకాలు వేస్తారు. టీకాలు క్రమం తప్పకుండా వేయించుకోవడం ద్వారా మాత్రమే రేబీస్ నుండి రక్షణ పొందవచ్చు. దీని నిర్మూలన ఒక్క వైద్య, ఆరోగ్య శాఖతోనే సాధ్యం కాదు. పశు సంవర్ధక శాఖ, స్థానిక సంస్థలు, పెంపుడు జంతువుల యజమానులు, బ్లూ క్రాస్ తదితర జంతుసంక్షేమ సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. ఇళ్లలో పెంచు కునే కుక్కలు, పిల్లులకు వాటి యజమానులు మూడవ నెల వయసులోనే మొదటి మోతాదు రేబీస్ టీకా వేయించాలి. ఆ తర్వాత ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా బూస్టర్ డోస్ ఇప్పించి రికార్డు లను భద్రపరచాలి. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా స్థానిక సంస్థలు గ్రామ, నగర స్థాయిలలో పెద్ద ఎత్తున ‘యానిమల్ బర్త్ కంట్రోల్’ (ఏబీసీ), సామూహిక రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి. వీధి కుక్కలను రాయితో కొట్టడం, వాటి ఆహారాన్ని కదిలించడం లేదా నిద్రిస్తున్నప్పుడు వాటిని భయపెట్టడం చేయకూడ దని పిల్లలకు స్పష్టంగా చెప్పాలి. జంతువుల ఆరోగ్యం, మానవ ఆరోగ్యం పరస్పరం ముడిపడి ఉన్నాయనే ‘వన్ హెల్త్’ విధానమే రేబీస్ రహిత సమాజానికి ఏకైక పరిష్కారం.

Printed, Published And Owned by YAMJALA PRAVEEN, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221, Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com